

రక్షణ, ఏవియేషన్‌లోనూ ‘టెంపుల్! 7


అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 3 సంచిక -112 మంగళవారం 6 అక్టోబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Districts


# కాళేశ్వరం మరమ్మతులు త్వరగా చేపట్టండి



**బ్యారేజీల ఎగువ, దిగువ భాగాల్లో డయాఫ్రం వాల్‌లు నిర్మించాలి**

**ఏదుల రిజర్వాయర్ నుంచే డిండి ఎత్తిపోతల పథకానికి జలాలు**

**నీటిపారుదల శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం**

**హైదరాబాద్, అక్టోబరు 5 (జర్నలిస్ట్ వార్త):** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నిర్ణీత వ్యవధిలోగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి నీటిపారుదలశాఖపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం బ్యారేజీల పునాదుల కింద భారీగా ఇసుక మైనింగ్ జరిగిందని, నిర్మాణ సమయంలో డిజైన్‌కు విరుద్ధంగా సీకెంట్ పైల్స్‌ను వినియోగించారని, వీటి అమరిక సరిగ్గా లేనందువల్ల బ్యారేజీల పునాదులు దెబ్బతిన్నాయని అధికారులు సీఎంకు నివేదించారు. మూడు బ్యారేజీలను పునరుద్ధరించి, మళ్లీ వినియోగంలోకి తేవాలంటే విధిగా బ్యారేజీల ఎగువ (అప్‌స్ట్రీమ్), దిగువ (డౌన్ స్ట్రీమ్)లలో డయాఫ్రం వాల్ కట్టాల్సి ఉంటుందని తెలిపారు. దాంతో పాటు బ్యారేజీల గేట్ల నుంచి విడుదలయ్యే వరద ప్రవాహ ఉధృత్తిని తట్టుకోవడానికి వీలుగా నీళ్లు పడే ప్రదేశం (స్టిల్లింగ్ బేసిన్)ను కూడా విస్తరించాల్సి ఉంటుందని వివరించారు. 2019లో బ్యారేజీల నిర్మాణం పూర్తి కాగా... ఆ తర్వాత ఏటా వరదలకు గేట్లు ఎత్తినప్పుడు డౌన్‌స్ట్రీమ్‌లోని రక్షణ వ్యవస్థలన్నీ దెబ్బతింటున్నాయని, టెయిల్‌పాండ్ ఉంటే బ్యారేజీల గేట్ల నుంచి వరదలోని శక్తిని నిర్వీర్యం చేసే అవకాశం ఉండేదని పేర్కొన్నారు. అధికారుల వివరణ విన్న సీఎం.. బ్యారేజీల మరమ్మతుల డిజైన్‌లకు తుదిరూపు ఇచ్చి... కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)లోని ఓవర్ సైట్ కమిటీ మధింపు అనంతరం పనులు ప్రారంభించాలని ఆదేశించారు. బ్యారేజీల ఎగువ, దిగువ భాగంలో డయాఫ్రం వాల్‌లు నిర్మించాలని,మిగతాది 2లో...

# కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు



**సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం విచారణ**

**కేంద్ర ప్రభుత్వం, ఈసీకి వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులు**

**ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాల్లో సీఈసీ ఒంటరిగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణ**

**చట్టవిరుద్ధమైన నిర్ణయాలు ఉంటే రద్దు చేస్తామన్న సుప్రీంకోర్టు ధర్మాసనం**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5, (జర్నలిస్ట్ వార్త):** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అధికారాల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. ఇతర కమిషనర్లతో సంప్రదించకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లను స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. మిగతాది 2లో...

# కలిసి పనిచేస్తాం

**భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది -స్విస్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్**

**100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు -ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు**

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** అంతర్జాతీయ దౌత్య రంగంలో భారత్ అత్యంత కీలకమైన శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్ ప్రశంసించారు. గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాలలో కూడా న్యూదిల్లీ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు 3 రోజుల అధికారిక పర్యటన నిమిత్తం దిల్లీ విచ్చేసిన ఆయన, ప్రధాని మోదీతోమిగతాది 2లో...



## ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారు

**మార్చారనేది నిస్సందేహంగా రుజువైంది**

**నిబంధనలకు విరుద్ధంగా సీఈసీ నిర్ణయాలు**

**సిఈసి జ్ఞానేష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలి**

**ఫారమ్-6 మార్పులపై రాహుల్ తీవ్ర విమర్శలు**




**న్యూఢిల్లీ, అక్టోబర్ 5,( (జర్నలిస్ట్ వార్త):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో ఫారమ్-6 మార్పులను తాము ఆమోదించలేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసిన వేళ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు.మిగతాది 2లో...

## మెదడు రహస్యాలను ఛేదించిన ఆప్టోజెనెటిక్స్

**వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన**

కార్ల్ డీస్సెరొత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాజెల్‌లను వరించిన పురస్కారం

ఆప్టోజెనెటిక్స్ అనే టెక్నిక్‌ను అభివృద్ధి చేసినందుకు ఈ గౌరవం

కాంతిని ఉపయోగించి మెదడులోని నరాల కణాలను నియంత్రించడం దీని ప్రత్యేకత

జ్ఞాపకాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి



2లో.

## సుప్రీంకోర్టు జడ్జిగా తెలంగాణ హైకోర్టు సీజే

**పదోన్నతి పొందిన జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్.. సుప్రీం న్యాయమూర్తులుగా మరో ఇద్దరి నియామకం**



2లో.

## ఒక్కో ఉద్యోగికీ రూ.1,10,250 బోనస్.

**సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బొనాంజా**

**బోనస్ పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక ప్రకటన**

**హైదరాబాద్, అక్టోబర్ 05 (జర్నలిస్ట్ వార్త):** దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సింగరేణి కార్మికులకు కేంద్రం బోనస్?ను ప్రకటించింది. ఈ మేరకు ఒక్కో ఉద్యోగికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్రమంత్రి కిషన్? రెడ్డి తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, సింగరేణి భవిష్యత్తు కోసం యాజమాన్యం, కార్మికులు మరింత సమన్వయంతో పనిచేయాలని కోరారు.మిగతాది 2లో...



## రేవంత్ సర్కార్ కుట్రలు

**వారసత్వ కట్టడాలను కూల్చేసే పన్నాగం**

**బొగ్గు గని ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి**

**లేకుంటే పెద్ద ఎత్తున మేం ఉద్యమిస్తాం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్, (జర్నలిస్ట్ వార్త)::**రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రంలో భూములు దోచుకోవడం అయిపోయింది. ఇక భూముల లోపల ఉన్న సంపద దోచుకొని, వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ మేరకు ఎక్స్ లో మిగతాది 2లో...

## ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు..

**ప్రత్యేక పాలసీకి తెలంగాణ ప్లాన్**

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు**

**అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచన**

**‘యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్’పైనా సమీక్ష**

**హైదరాబాద్, అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త)::** తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో మిగతాది 2లో...



## ఏసీబీ వలలో డీఎంహెచ్ఓ

**రూ.2 లక్షల డిమాండ్..**

**రూ.లక్ష తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లాడీఎంహెచ్ఓ సహా ముగ్గురు అరెస్ట్**



# మెదడు రహస్యాలను ఛేదించిన ఆప్టోజెనెటిక్స్

## వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5, (జర్నలిస్ట్ వార్త):** ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరొత్ (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. 'కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్'పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది.మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. కానీ, అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది" అని నోబెల్ కమిటీ ఛైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు.

ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. 'క్లామిడోమోనాస్' అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై 'ఛానెల్‌రోడోప్సిన్' అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్‌ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రొటీన్‌లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు. ఈ ప్రొటీన్‌ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు.ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరొత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్‌రోడోప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ 'కాంతి ఆధారిత స్విచ్' పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు.

ప్రస్తుతం 'ఆప్టోజెనెటిక్స్' అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఉపయోగించి పరిశోధకులు నిర్దిష్ట జ్ఞాపకాలు, భయం, ఆనందం వంటి భావోద్వేగాలు, ప్రవర్తనలను నియంత్రించే నాడీ వలయాలను (న్యూరల్ సర్క్యూట్స్) ఛేదిస్తున్నారు. ఇది మానసిక, నాడీ సంబంధిత వ్యాధులపై మన అవగాహనను పెంచుతోంది. వైద్య రంగంలో, దృష్టి లోపం ఉన్నవారికి తిరిగి చూపును అందించే ప్రయత్నాలలో ఈ పద్ధతిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ మన మెదడుపై ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. ఈ సాంకేతికత సాయంతో ప్రతిరోజూ కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తూ, మానవాళి ముందున్న అతిపెద్ద రహస్యాలలో ఒకటైన మన మెదడు పనితీరును అర్థం చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తున్నాయి.

# కాళేశ్వరం మరమ్మతులు త్వరగా చేపట్టండి

(మొదటి పేజి తరువాయి)

స్టిల్లింగ్ బేసిన్‌ను కూడా పెంచాలని సూచించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎవీఫఆర్)పై కూడా సమావేశంలో చర్చ జరిగింది. తుమ్మిడిహెట్టి బ్యారేజీలపై సీడబ్ల్యూసీ అధికారులతో సమావేశం అనంతరం.. వారు కోరిన కీలక వివరాలన్నీ సీడబ్ల్యూసీకి, మహారాష్ట్ర అధికారులకు పంపించినట్లు అధికారులు తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని ఏదుల రిజర్వాయర్ నుంచే డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఈ పథకం డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించినప్పుడే ఈ విషయాన్ని పొందుపరచడం జరిగిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి పథకం పరిధిలో అవసరాలు తీర్చుతూనే డిండికినీటిని తరలించాలని ఆదేశించారు. డిండిలో కెనాల్, ఇతర కాంపోనెంట్లు కొలిక్కి వచ్చినప్పటికీ హెడ్ రెగ్యులేటరీ విషయంలో సందిగ్ధత ఉందని అధికారులు చెప్పగా.. ఏదుల నుంచే డిండికి నీటిని తరలించాలని సీఎం స్పష్టం చేశారు.

# ఏసీబీ వలలో డీఎంహెచ్ఓ

## రూ.2 లక్షల డిమాండ్..

## రూ.లక్ష తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లాడీఎంహెచ్ఓ సహా ముగ్గురు అరెస్ట్




**రంగారెడ్డి (జర్నలిస్ట్ వార్త):** అవినీతిపై ఏసీబీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నప్పటికీ కొందరు ప్రభుత్వ అధికారులు లంచాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్య శాఖలో సోమవారం జరిగిన ఏసీబీ దాడి కలకలం రేపింది. ఫిజియోథెరపీ సెంటర్‌కు లైసెన్స్ కోసం రూ.లక్ష లంచం.. ముగ్గురు ఏసీబీకి చిక్కిన వైనం రంగారెడ్డి: ఫిజియోథెరపీ సెంటర్‌కు సంబంధించిన వ్యవహారంలో రూ.లక్ష లంచం తీసుకున్న కేసులో రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ కార్యాలయానికి చెందిన ఇద్దరు అధికారులతో పాటు ఓ ప్రైవేట్ డ్రైవర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి, డీఎంహెచ్ఓ కార్యాలయ హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఎం. శ్రీనివాస్ సూచనల మేరకు వారి వద్ద ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మద్దూరి కృష్ణయ్య ఫిర్యాదుదారుడిని రూ.2 లక్షలు లంచం డిమాండ్ చేశాడు.చివరకు రూ.లక్ష తీసుకునేందుకు అంగీకరించాడు. సీజ్ చేసిన ఫిజియోథెరపీ సెంటర్ తాళాలను తిరిగి ఇవ్వడం, డీఎంహెచ్ఓ లైసెన్స్ లేకుండా కేంద్రం నిర్వహిస్తున్నప్పటికీ తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండటం,అలాగే కొత్త డీఎంహెచ్ఓ లైసెన్స్ ఇప్పించేందుకు ఈ మొత్తాన్ని లంచంగా డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది.ఫిర్యాదుదారుడి నుంచి తీసుకున్న రూ.1,00,000 నగదును మద్దూరి కృష్ణయ్య వద్ద నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విధులను సక్రమంగా నిర్వహించకుండా అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు అధికారులు పేర్కొన్నారు.ఈ కేసులో డీఎంహెచ్ఓ స్వర్ణకుమారి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాస్, ప్రైవేట్ డ్రైవర్ మద్దూరి కృష్ణయ్యలను నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచి న్యాయ రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ వెల్లడించింది. ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా వెల్లడించలేదు.

# ఓటర్ల జాబితా సవరణ ఈసీ ప్రక్రియే

## ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాల విమర్శలు... బీజేపీ చీఫ్ రామచందర్ రావు కౌంటర్

## దొంగ ఓటర్లను, చనిపోయిన ఓటర్లను తొలగించడమే లక్ష్యమని వ్యాఖ్య

## ఓడిపోయినప్పుడల్లా ఈసీ, ఈవీఎంలపై నిందలు వేస్తారని విమర్శలు



**హైదరాబాద్, అక్టోబర్ 5( జర్నలిస్ట్ వార్త):** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియపై ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. ఇది బీజేపీ చేస్తున్న కార్యక్రమం కాదని, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన ప్రక్రియ అని స్పష్టం చేశారు. దొంగ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించడమే దీని ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు.

సోమవారం ఆయన మాట్లాడుతూ, "ఈ ప్రక్రియను బీజేపీ ప్రవేశపెట్టలేదు, ఇది ఎన్నికల సంఘం చేపట్టిన ప్రక్రియ అని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, ఇతర నేతలు తెలుసుకోవాలి. కాంగ్రెస్ హయాంలో కూడా ఇది జరిగింది. అప్పుడు వ్యతిరేకించని వారు ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారు?" అని ప్రశ్నించారు. కేరళలో ఎస్ఐఆర్ తర్వాత కాంగ్రెస్ గెలిచినా, దానికి వారి వద్ద సమాధానం లేదని ఎద్దేవా చేశారు."కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి ఎన్నికల్లో ఓడిపోయినప్పుడల్లా ఈసీపై లేదా ఈవీఎంలపై నిందలు వేయడం అలవాటుగా మారింది. గత 12 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉండటంతో ఓవైసీ, కాంగ్రెస్ పార్టీలీూ 'కళ్లోూతో ఉన్నాయి. అందుకే ఎస్ఐఆర్ గురించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయి" అని రావు ఆరోపించారు. చనిపోయినవారు, నకిలీ ఓటర్లు, విదేశీయుల పేర్లను తొలగించడం, వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి ఓట్లను అక్కడికి మార్చడమే ఎస్ఐఆర్ ఉద్దేశమని ఆయన వివరించారు.

కాగా, ఈ ప్రక్రియ ద్వారా ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తున్నారని, ఇది బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకేనని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు ఆదివారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద, దేశంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టాయి. ముసాయిదా జాబితా నుంచి 13 కోట్ల పేర్లను తొలగించారని వారు ఆరోపిస్తున్నారు. అయితే, అధికార బీజేపీ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది.

## రేవంత్ సర్కార్ కుట్రలు

(మొదటి పేజి తరువాయి)

ఆరోపించారు. రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం దారుణమని అన్నారు. మీటర్ల కొద్ది లోతులో తవ్వకాలు, బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళకు ప్రతిరూపం, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాల యానికి, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని ఆందోళన వ్యక్తం చేశారు. వారసత్వ సంపదను ధ్వంసం చేసే కుట్రలను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని వెల్లడించారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## ఒక్కో ఉద్యోగికీ రూ.1,10,250 బోనస్.

ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా సింగరేణి కూడా బొగ్గు ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. రానున్న దసరా, దీపావళి, నవరాత్రుల పండుగల కానుకగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయమైనది. దేశానికి వెలుగులు పంచేందుకు పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిది. సింగరేణి బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదు. సింగరేణి పరిశ్రమ మన తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారం. లక్షలాది కుటుంబాలకు జీవనాధారం. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో కీలక భాగస్వామి అని అన్నారు. దేశ ప్రగతిలో, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి మరింత కీలకపాత్ర పోషించాలని కిషన్? రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్?లో ట్వీట్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సింగరేణికి ఇవ్వాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు.

# కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

(మొదటి పేజి తరువాయి)

వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు.ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. "రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం" అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ విధులకు ఆటంకం కలిగించేలా లేదా ఆయనను సస్పెండ్ చేసేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కోర్టు నిరాకరించింది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సీఈసీ ఒక్కరే కాకుండా, ముగ్గురు సభ్యుల కమిషన్ సంయుక్తంగా వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులతో ఈ వ్యవహారంపై కేంద్రం, ఈసీ ఎలాంటి వివరణ ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

# ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు..

(మొదటి పేజి తరువాయి)

పాటు మరో నాలుగు అంతర్జాతీయ యూనివర్సిటీలు ఫ్యూచర్ సిటీలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపినట్లు అధికారులు సీఎస్‌కు తెలిపారు.విదేశీ వర్సిటీలను ఆహ్వానించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పెట్టుబడులకు అవకాశం కల్పించడం, అనుమతులు సులభతరం చేయడం, విద్యా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను పాలసీలో చేర్చాలని సంజయ్ జాజు సూచించారు. తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రతిపాదిత వర్సిటీల ప్రతినిధులతో చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నాటికి ఈ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని సూచించారు.ఇదే సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్షించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశలవారీగా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2027 డిసెంబర్ నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయాలని, 2028 జూన్ నాటికి ఈ సంఖ్యను 87కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఒక్కో పాఠశాలను సుమారు 26 ఎకరాల్లో నిర్మించనున్నారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదుల వంటి సదుపాయాలు కల్పించనున్నారు. నిర్మాణ పనులను క్రమం తప్పకుండా సమీక్షించి, నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.

# సుప్రీంకోర్టు జడ్జిగా తెలంగాణ హైకోర్టు సీజే

**హైదరాబాద్/న్యూఢిల్లీ,( (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్.. సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టు జడ్జిగా ఆయన నియామకానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్‌తోపాటు గుజరాత్, ఢిల్లీ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ సునితా అగర్వాల్, జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయలకు కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించారు. ఈ ముగ్గురిని సుప్రీంకోర్టు జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం సెప్టెంబరు 28న కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆ సిఫారసుకు కేంద్రం తాజాగా ఆమోదం తెలిపినట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. తాజా నియామకాలతో దేశ సర్వోన్నత న్యాయస్థానం జడ్జిల సంఖ్య 37కు చేరింది. ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తితో కలిపి న్యాయమూర్తుల సంఖ్య 34 ఉండగా.. ఇటీవల సుప్రీంకోర్టు సవరణ చట్టం-2026 ప్రకారం ఈ సంఖ్యను 38కి పెంచారు. కాగా, సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులైన జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ 2025 జూలై 19న తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్?సగా ప్రమాణ స్వీకారం చేశారు. 1965 జూలై 7న జన్మించిన జస్టిస్ ఏకే సింగ్.. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ ఆనర్స్, ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. 1990లో పాట్నా హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 1990 నుంచి 2000 సంవత్సరం వరకు పాట్నా హైకోర్టులో, 2001 నుంచి 2012 వరకు ఝార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012 జనవరి 24న ఝార్ఖండ్ హైకోర్టు అదనపు జడ్జిగా, 2014లో ఝార్ఖండ్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

# కలిసి పనిచేస్తాం

(మొదటి పేజి తరువాయి)

ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం ఒకవైపు రాజకీయంగా, భౌగోళికంగా విభజనకు గురవుతున్న తరుణంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం అత్యంత కీలకం అని మాట్లాడారు. ఏ అంతర్జాతీయ వేదిక అయినా భారత్ చర్చలు, సహకారానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని కూడా తాము అనుసరిస్తామని తెలిపారు. గ్లోబల్ టెక్నాలజీ చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలోనూ భారత్ అసాధారణ నాయకత్వ పటిమను ప్రదర్శించిందని పార్మెలిన్ అన్నారు. ఈ క్రమంలోనే 2026 ఫిబ్రవరిలో న్యూదిల్లీ వేదికగా భారత్ నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026' గొప్ప విజయాన్ని సాధించిందని ప్రశంసలు కురిపించారు. దీనికి 88 దేశాలు, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని ఆయన గుర్తు చేశారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్ విధానం ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సాంకేతిక ప్రయోజనాలు కొన్ని దేశాలు, సంస్థలకే పరిమితం కాకుండా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు చేరేలా భాగస్వామ్యం కల్పించడానికి, ఏఐ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్విట్జర్లాండ్ కృషి చేస్తుందన్నారు. 2027 జూన్‌లో జెనీవాలో స్విట్జర్లాండ్ నిర్వహించబోయే తదుపరి గ్లోబల్ ఏఐ సమిట్‌కు భారత్‌ను కీలక భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు పార్మెలిన్ పేర్కొన్నారు. ఇక్కడ ఆమోదించిన 'న్యూదిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్' మార్గదర్శకాల ఆధారంగానే తాము కూడా ముందుకు సాగుతామని వెల్లడించారు. భారత్-స్విట్జర్లాండ్ ఆర్థిక సంబంధాల్లో ఇండియా- యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ మధ్య జరిగిన (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) కీలకంగా మారుతోంది. భారత్, స్విస్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెయిన్‌లతో కూడిన మధ్య కుదిరిన ఈ డీల్ 2025, అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ డీల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దీని అమలు తీరుపై తాము చాలా సంతోషంగా ఉన్నామని పార్మెలిన్ వెల్లడించారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చాక స్విస్ కంపెనీల నుంచి ఆసక్తి బాగా పెరిగిందన్నారు. రానున్న సంవత్సరాల్లో భారత్- స్విట్జర్లాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారు

(మొదటి పేజి తరువాయి)

జ్ఞానేశ్ కుమార్ నిబంధనలకు విరుద్ధంగా, ఏకపక్షంగా ఫారమ్-6లో మార్పులు చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై జరిగిన ఈ నేరపూరిత దాడిలో జజుజతో పాటు బాధ్యులైన ప్రతి ఒక్కరినీ జవాబుదారీగా నిలదీస్తామని ఆయన హెచ్చరించారు. జ్ఞానేష్ కుమార్ ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారని ఇప్పుడు నిస్సందేహంగా రుజువైందని అన్నారు. బీజేపీకి సహాయం చేయడానికి ఆయన తన పదవిని దుర్వినియోగం చేస్తున్నాడనడానికి ఇది మరో రుజువు అని తెలిపారు. తన ఆరోపణకు మద్దతుగా గతంలో ఈసీఐ విడుదల చేసిన పత్రికా ప్రకటన చిత్రాన్ని కూడా పంచుకున్నారు. అందులో "సర్ కోసం ఫారం 6కు జతచేసిన ప్రకటనను సుప్రీంకోర్టు సమర్థించింది. సర్ లేని కాలానికి, నిబంధనల (ఓటర్ల నమోదు నిబంధనలు 1960) ప్రకారం వర్తించే ఫారాలను ఉపయోగించాలి." అని అందులో ఉంది. మరోవైపు ప్రక్రియలో జరిగిన పేర్ల తొలగింపులు రాజ్యాంగం, ఎన్నికల ప్రక్రియ మౌలిక సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ప్రజలు ఇప్పుడు గ్రహించారని ఆమె స్పష్టం చేశారు. "జరిగిన ఈ తొలగింపులు మన రాజ్యాంగం, ఎన్నికల ప్రక్రియ స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టంగా తెలుస్తోంది. దీనిపై మేము నిరసన వ్యక్తం చేస్తున్నాం. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ప్రజలు గ్రహించారని నేను భావిస్తున్నాను. కాబట్టి మా నిరసనను కొనసాగిస్తాం." అని అన్నారు. సీఈసీ స్పష్టంగా, నిస్సందేహంగా అబద్ధం చెప్పారని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ విరుచుకుపడ్డారు. ప్రధాని భయపడే జెన్ జెడ్ ఓటర్లను తొలగించడానికి సీఈసీ స్వయంగా ఫారం 6ను ఉద్దేశపూర్వకంగా సవరించారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్? షాల ఆదేశాలతో రాజ్యాంగానికి తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. ఆప్ నేత మనీష్ సిసోడియా ఆ మార్పులపై ప్రశ్నలు లేవనెత్తారు. ఫారం 6ను మార్చడానికి జ్ఞానేష్ కుమార్ అనుమతి తీసుకోలేదని సుప్రీం కోర్టు స్పష్టంగా చెప్పిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని సిసోడియా అన్నారు. జ్ఞానేష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మార్పులు ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు ప్రక్రియపై ప్రభావం చూపవచ్చని సిసోడియా ఆరోపించారు. ఫారం 6 అనేది ఒక దరఖాస్తు. దీని ద్వారా అర్హత ఉన్న వ్యక్తి మొదటిసారిగా ఓటర్ల జాబితాలో చేరాలని కోరుకుంటారు.




# మట్టి కింద సమాధవుతున్న నిజాలు.

## వెన్నవల్లిలో గుట్టల విధ్వంసం! -మట్టి తవ్వకాల్లో జేసీబీ డ్రైవర్ మృతి

### అక్రమ తవ్వకాలపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్





**కల్లూరు/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** అభివృద్ధి పనుల పేరుతో ప్రకృతి వనరుల విచ్చలవిడి తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కల్లూరు మండలం వెన్నవల్లి గ్రామంలో కలకలం రేపుతున్నాయి. గ్రామ సమీపంలోని గుట్టల్లో మట్టి తవ్వకాల సందర్భంగా చరియలు విరిగిపడి జేసీబీ డ్రైవర్ మృతి చెందిన ఘటన తీవ్ర ఆందోళనకు దారితీసింది. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? నిబంధనలు పాటించారా? అనే అంశాలను అధికారులు తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

**అనుమతులు ఉన్నాయా.. నిబంధనలు పాటించారా?**

వెన్నవల్లి పరిసరాల్లో భారీగా మట్టి తరలింపు జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజూ పెద్ద సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగుతుండటంతో గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయని, దుమ్ము ధూళితో పంట పొలాలు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. భారీ స్థాయిలో తవ్వకాలు జరుగుతున్న నేపథ్యంలో మైనింగ్, అటవీ, కాలుష్య నియంత్రణ తదితర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**డ్రైవర్ మృతి.. బాధ్యత ఎవరిది?**

మట్టి తవ్వకాల సమయంలో చరియలు విరిగిపడి జేసీబీ డ్రైవర్ మృతి చెందడం ఘటనలో భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. తవ్వకాలకు అనుమతులు, పని ప్రదేశంలో భద్రతా చర్యలు, బాధ్యుల వివరాలపై సమగ్ర దర్యాప్తు జరపాలని స్థానికులు కోరుతున్నారు.

**గుట్టలు మాయమైతే పర్యావరణ పరిస్థితి ఏమిటి?**

గుట్టల తొలగింపుతో వన్యప్రాణుల ఆవాసాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తవ్వకాల వల్ల పర్యావరణానికి నష్టం జరుగుతుందా? వన్యప్రాణుల సంచారంపై ప్రభావం పడుతోందా? అనే అంశాలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అవసరం ఉంది.

**ఉన్నతాధికారులు స్పందించాలి**

వెన్నవల్లి ప్రాంతంలో జరుగుతున్నట్లు చెబుతున్న మట్టి తవ్వకాలపై సంబంధిత శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాలని, అనుమతులు లేకుండా తవ్వకాలు జరిగితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మృతి చెందిన జేసీబీ డ్రైవర్ కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## మామునూరు విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టాలి

### రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి.. చిట్యాల బాబు



**హసన్‌పర్తి/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా మామునూరులో ఏర్పాటు చేయనున్న విమానాశ్రయానికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మామునూరు విమానాశ్రయం ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, విమానాశ్రయానికి అంబేద్కర్ పేరు పెట్టేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు. అంబేద్కర్ ఆశయాలను గౌరవించేలా విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కడారి దేవన్న మాట్లాడుతూ అంబేద్కర్ పేరును విమానాశ్రయానికి పెట్టాలని కోరారు. ఈ డిమాండ్‌కు అంబేద్కర్ అభిమానులు, వివిధ ప్రజా, మహిళా సంఘాలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

### కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్య కూటమికి మద్దతివ్వాలి





**హసన్‌పర్తి/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** ఆర్టీసీ ఎన్నికల నేపథ్యంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సోమవారం హనుమకొండ బస్టాండ్‌తో పాటు స్థానిక డిపో2లో ఆర్టీసీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను కలిసి వారి సమస్యలు, సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, మెరుగైన పని పరిస్థితులపై మాట్లాడారుకార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేసే నాయకత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే నాగరాజు కోరారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని, సంస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. ఎన్నికల్లో ఐక్యంగా ముందుకు సాగి కార్మికుల ప్రయోజనాలను కాపాడే యూనియన్‌కు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారుకార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కూర వెంకట్, కాంగ్రెస్ అధికార ప్రతినిధి రవళిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భయ్యాగాని కుమార్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీసం సురేందర్‌రెడ్డి, ఆర్టీసీ నాయకులు, కార్మికులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ఎన్టీఆర్ విగ్రహానికి రూ.లక్ష విరాళం

### విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను పరిశీలించిన టీడీపీ నాయకులు



**తల్లాడ/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని రింగురోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేస్తున్న స్వర్గీయ నందమూరి తారక రామారావు భారీ విగ్రహం ఆవిష్కరణకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు వనమా వాసు విగ్రహం ఏర్పాటుకు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ విగ్రహాలు, జెండా దిమ్మెల ఏర్పాటుకు వనమా వాసు ఆర్థిక సహాయం అందించడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. అనంతరం విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్ల పురోగతిని నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా అడహక్ కమిటీ సభ్యులు కొండబాల కరుణాకర్, జిల్లా కమిటీ సభ్యులు కేతినేని హరీష్, మాజీ సింగిల్ విండో చైర్మన్ గడిపూడి వెంకటేశ్వరరావు, నాగార్జున శ్రీనివాస్, కూచిపూడి వెంకటేశ్వరరావు, కొమ్మినేని రామయ్య, నున్నా తారకరామారావు, కొమ్మినేని నరసింహారావు, కొమ్మినేని సత్యనారాయణ, నల్లమోతు సత్యనారాయణ, కొమ్మూరి అప్పారావు, కర్ణాటి అశ్వనీకుమార్, వనమా సతీష్, కామినేని శ్రీనివాస్, బోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఎల్లాపూర్‌లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభం

### గ్రామ సమస్యలపై సర్వే నిర్వహించిన వాలంటీర్లు






**హసన్‌పర్తి/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** ఎస్ఆర్‌యూ యూనివర్సిటీ వరంగల్‌కు చెందిన ఎస్ఆర్‌యూ ఎన్ఎస్ఎస్‌యూఎన్ఐటీ ఆధ్వర్యంలో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎన్ఎస్-ఎస్ వారాంత ప్రత్యేక శిబిరం సోమవారం హసన్‌పర్తి మండలం 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామంలో ప్రారంభమైంది. ఈ నెల 5 నుంచి 11వ తేదీ వరకు ఏడు రోజుల పాటు శిబిరం కొనసాగనుంది. నేను కాదు. నువ్వు అనే సేవా స్ఫూర్తితో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. శిబిరంలో భాగంగా మొదటి రోజు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఎల్లాపూర్ గ్రామంలో సర్వే నిర్వహించారు. గ్రామంలోని సామాజిక, విద్యా, ఆరోగ్య, పారిశుధ్య, ప్రాథమిక అవసరాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో ఆయా సమస్యలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సర్వే దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డా. కె. రవీందర్ మాట్లాడుతూ వాలంటీర్లు ఏడు రోజుల పాటు జరిగే అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వనజ, ముంతాజ్, నాగరాజు వాలంటీర్లకు పలు సూచనలు, మార్గదర్శకాలు అందించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందుతాయని తెలిపారు. కార్యక్రమంలో వాలంటీర్లు, అధ్యాపకులు, పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

### గ్రామ సర్పంచ్ జోగు సంపత్‌కుమార్




**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 05 (జర్నలిస్ట్ వార్త):** పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని గ్రామ సర్పంచ్ జోగు సంపత్‌కుమార్ అన్నారు. మండలంలోని మీదికొండ గ్రామంలోని 2, 3వ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సోమవారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ మాట్లాడుతూ పోషకాహారం ఆరోగ్యకరమైన కుటుంబానికి పునాది వంటిదన్నారు. పోషక పదార్థాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార వంటకాలు తయారు చేసి తల్లులు, పిల్లలకు అందించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న అంగన్‌వాడీ సేవలను గర్భిణీలు, బాలింతలు, తల్లులు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పోషణ మాసం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆలకుంట్ల శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు వేల్పుల సువర్ణ, తాళ్లపల్లి రమ, ఏఎన్ఎం కవిత, ఆశ కార్యకర్తలు ఆర్.రజిత, జయ, రజిత, పుష్పలత, తల్లులు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే జన విజ్ఞాన వేదిక లక్ష్యం

### మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా చిర్ర యాకాంతంగౌడ్ ఏకగ్రీవ ఎన్నిక



**కేసముద్రం/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** సమాజంలో పెరుగుతున్న మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావాలను రూపుమాపి ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే జన విజ్ఞాన వేదిక ప్రధాన లక్ష్యమని నూతనంగా ఎన్నికైన మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు చిర్ర యాకాంతంగౌడ్ అన్నారు. జన విజ్ఞాన వేదిక మహబూబాబాద్ జిల్లా 6వ మహాసభల్లో 202628 కాలానికి నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చిర్ర యాకాంతంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఆగుర్తి సురేష్, చెకిముఖి కన్వీనర్‌గా గాదె నవీన్, కోశాధికారిగా ఉప్పల శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

కేసముద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యాకాంతంగౌడ్ మాట్లాడుతూ ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని, ఆధారాలతో కూడిన ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. మూఢనమ్మకాల పేరుతో అమాయక ప్రజలను మోసం చేసే అశాస్త్రీయ విధానాలను శాస్త్రీయ ప్రయోగాల ద్వారా ఎండగడతామని అన్నారు.

**పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు**

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు, సైన్స్ ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. 'చెకిముఖి' కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశీలనా శక్తిని పెంపొందించి ఈ కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరిస్తామని పేర్కొన్నారు.

**తప్పుడు ప్రచారాలపై శాస్త్రీయ అవగాహన**

సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాప్తి చెందుతున్న తప్పుడు సమాచారాన్ని శాస్త్రీయ ఆధారాలతో ప్రజలకు వివరిస్తామని యాకాంతంగౌడ్ తెలిపారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణతో పాటు నకిలీ వైద్యం, అశాస్త్రీయ చికిత్సలపై ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు. రాజ్యాంగం నిర్దేశించిన ప్రాథమిక కర్తవ్యాల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం కూడా ఒకటని గుర్తుచేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, మేధావులను భాగస్వాములను చేస్తూ నూతన కమిటీతో జిల్లాలో జన విజ్ఞాన వేదికను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులపై వేగంగా స్పందించాలి

## వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందించాలి -జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక అధికారులు శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించాలని, డైట్ మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు. అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, స్నాక్స్ నాణ్యతపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పోషకాహారం, విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతిరోజూ డైట్ మెనూకు సంబంధించిన ఫోటోలను సంబంధిత వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ నిబంధనల మేరకు వసతి గృహాలకు నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని తెలిపారు. ఎమ్మెల్సీ



ఎన్నికల నేపథ్యంలో వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గంలో అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అధికారులు, సిబ్బంది ముందుగా తమ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. అన్ని శాఖల ఉద్యోగులు ముఖచిత్ర హాజరు యాప్‌లో నమోదు చేసుకుని రోజువారీ హాజరు వేయాలని తెలిపారు.

ప్రజావాణిలో ఇనుగుర్తి మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన గుండాల మంగమ్మ తన బంధువుల పట్టాదారు పాసుపుస్తకాలు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయని, ఆ తర్వాత ఇతరులు తమ భూమిని తమ పేర్లపై పట్టా చేసుకున్నారని ఫిర్యాదు చేశారు. వాటిని పరిశీలించి భూమిని తమ పేర్లపై పట్టా చేయాలని కోరారు. కేసముద్రం మండలం భూక్యారాం తండాకు చెందిన రమేష్ తనకు కేటాయించిన ఇంటి స్థలంలో నిర్మించుకున్న ఇంటికి నంబరు కేటాయించాలని వినతిపత్రం ఇచ్చారు. గూడూరు మండలం మాట్వాడకు చెందిన తోలెం సౌజన్య ఒంటరి మహిళ పింఛన్ మంజూరు చేయాలని కోరారు.

జిల్లావ్యాప్తంగా మండలాల నుంచి 110, డివిజన్ స్థాయిలో 9, జిల్లా కేంద్రంలో 146 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. వీటిలో కొన్ని తక్షణమే పరిష్కరించగా, మరికొన్నింటిని సంబంధిత శాఖలకు పంపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్‌కుమార్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పీడీ పురుషోత్తం, డీఆర్‌డీవో పీడీ మధుసూదన రాజు, పరిపాలన అధికారి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కల్వలలో అంకుర్ సీడ్స్ 888 పత్తి ప్రదర్శన క్షేత్రం పరిశీలన

**కేసముద్రం/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** కేసముద్రం మండలం కల్వల గ్రామంలో రైతు బొగ్గుల యాలాద్రి సాగు చేసిన అంకుర్ సీడ్స్ 888 రకం పత్తి పంటను సోమవారం కంపెనీ ప్రతినిధులు, స్థానిక రైతులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట దిగుబడి, కాయల పరిమాణం, మొక్క ఎదుగుదలను పరిశీలించారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి గండి శ్రీనివాస్ మాట్లాడుతూ 888 రకం పత్తిలో కాయల పరిమాణం పెద్దగా ఉండటంతోపాటు మొక్క కింది భాగం నుంచి పైభాగం వరకు కాయలు రావడం, గింజల సంఖ్య అధికంగా ఉండటం, పత్తి ఏరేందుకు కూలీలకు



సులభంగా ఉండటం ఈ రకం ప్రత్యేకతలని తెలిపారు. డిస్ట్రిబ్యూటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అంకుర్ సీడ్స్ ట్రిబుల్ ఐటీ పత్తి రకం కూడా రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. అలాగే మొక్కజొన్నలో భాస్కర్ రకాన్ని సాగు చేస్తే అధిక దిగుబడి సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతులు పెదగాని రవి, కొమ్మాల జయేందర్ రెడ్డి, చింతలూరు శ్రీధర్, గంట సుధాకర్ రెడ్డి, డొంకరి వెంకన్న, గుర్రం నరేందర్, మేక వెంకట్ రెడ్డి, మూల వెంకటరెడ్డి, బొగ్గుల చంద్రం తదితరులు పాల్గొన్నారు.

# నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

## విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలి: ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్





**నర్సంపేట/అక్టోబర్ 5 (జర్నలిస్టు వార్త):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), నర్సంపేటలో ప్రథమ సంవత్సరం విద్యార్థుల స్వాగతోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూతన విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల జీవితం కేవలం పాఠ్యపుస్తకాలు, పరీక్షలు, మార్కులకు మాత్రమే పరిమితం కాదన్నారు. విద్యార్థులు జ్ఞానంతో పాటు వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవాలని సూచించారు. స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు పట్టుదలతో కృషి చేయాలని అన్నారు. అపజయాలను చూసి నిరుత్సాహపడకుండా వాటిని పాఠాలుగా స్వీకరించి ముందుకు సాగాలని సూచించారు. కళాశాలలోని గ్రంథాలయం, ప్రయోగశాలలు, డిజిటల్ వనరులు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నాణ్యమైన బోధనతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కళాశాల ప్రాధాన్యం ఇస్తోందని ప్రొఫెసర్ మల్లం నవీన్ తెలిపారు. విశ్వవిద్యాలయ పరీక్షలు, పోటీ పరీక్షలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పరిశోధన, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ తదితర రంగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ కళాశాలకు మంచి పేరు తీసుకువస్తున్నారని పేర్కొన్నారు. నూతన విద్యార్థులు కూడా తమ ప్రతిభతో కళాశాల కీర్తిని మరింత పెంచాలని ఆకాంక్షించారు.

అనంతరం ప్రథమ సంవత్సరం విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాలు, ఆశయాలను వెల్లడించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్563తో ఎల్లాపూర్ రైతులకు ఆగం

## రోడ్డు కం బ్రిడ్జితో పంట పొలాల్లోకి వరద నీరు..

## కలెక్టర్‌కు ప్రజావాణిలో రైతుల ఫిర్యాదు

**హసన్‌పర్తి/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** కేంద్ర ప్రభుత్వం నిర్మించిన జాతీయ రహదారి563తో 65వ డివిజన్ ఎల్లాపూర్ రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు వెలిసోజు పాపయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధికి దోహదపడాల్సిన రహదారి నిర్మాణం తమ పంట పొలాలకు నష్టం కలిగించేలా మారిందని ఆరోపించారు. ఎల్లాపూర్‌లోని సర్వే నంబర్ 535ఏ/2 వద్ద రోడ్డు కం బ్రిడ్జి నిర్మాణం కారణంగా వర్షాలు, వరదల సమయంలో నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేక తన పొలంలోనే నిలిచిపోతోందని పాపయ్య తెలిపారు. దీంతో పంట పొలాలు నీట మునిగి పంట నష్టం వాటిల్లుతోందన్నారు. వరద నీటిని బయటకు పంపేందుకు డీజిల్ మోటార్లను వినియోగించాల్సి వస్తోందని, ఇందుకు ప్రతిసారీ వేల రూపాయలు



ఖర్చవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కోసం పలుమార్లు జాతీయ రహదారి ప్రాజెక్టు అధికారులను, సైట్ ఇన్‌చార్జి ఇంజనీర్ సురేష్‌ను సంప్రదించినట్లు తెలిపారు. వరద నీరు వెళ్లేందుకు పైపులైన్ నిర్మిస్తామని హామీ ఇస్తూ కాలయాపన చేస్తున్నారే తప్ప ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం రహదారి పనులు దాదాపు 90 శాతం పూర్తయిన నేపథ్యంలో సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందన్నారు. వరద కాలువ లేదా తగిన నీటి పారుదల మార్గాన్ని వెంటనే ఏర్పాటు చేసి పంట పొలాల్లోకి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు పాపయ్య తెలిపారు. అధికారులు సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

# పెసలు, వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

## వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**వైరా/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** వైరా వ్యవసాయ మార్కెట్‌లో పెసలు, వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు

# గవర్నర్ కోటాలో ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌కు ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలి

## పద్మశాలి వర్గానికి సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి

## రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ఇన్‌చార్జి చింతకింది కృష్ణమూర్తి

**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** రానున్న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానంలో పద్మశాలి వర్గానికి చెందిన ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌కు అవకాశం కల్పించాలని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ఇన్‌చార్జి, సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ గవర్నర్ కోటాలో ప్రొఫెసర్ గడ్డం భాస్కర్‌ను ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తే పద్మశాలి వర్గానికి సముచిత ప్రాతినిధ్యం దక్కుతుందని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5) ప్రకారం సాహిత్యం, విజ్ఞానం, కళలు, సహకార ఉద్యమం, సామాజిక సేవ తదితర రంగాల్లో ప్రత్యేక జ్ఞానం, అనుభవం ఉన్న వ్యక్తులను గవర్నర్ శాసనమండలికి



నామినేట్ చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ సేవలు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను చింతకింది కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు.

# పట్టభద్రులంతా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలి

## బీఆర్ఎస్ కేసముద్రం మున్సిపాలిటీ అధ్యక్షుడు గుగులోత్ వీరునాయక్

**కేసముద్రం/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్‌ఖమ్మంనల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ కేసముద్రం మున్సిపాలిటీ అధ్యక్షుడు గుగులోత్ వీరునాయక్, ప్రధాన కార్యదర్శి నర్సింగం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. అర్హులైన ప్రతినిధులను చట్టసభలకు ఎన్నుకోవడం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన చట్టాల రూపకల్పనకు అవకాశం ఉంటుందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు, మాజీ, ప్రస్తుత కౌన్సిలర్లు, ముఖ్య కార్యకర్తలు, అనుబంధ సంఘాల బాధ్యులు, తెలంగాణ ఉద్యమకారులు, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని కోరారు.



# పోషకాహారంతో రక్తహీనతకు చెక్

## శ్రీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాస వేడుకలు



**తల్లాడ/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని మల్లవరం గ్రామంలో తొమ్మిదో జాతీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా శ్రీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. సీడీపీవో నిర్మలజ్యోతి మాట్లాడుతూ సంపూర్ణ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రతిఒక్కరూ తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని తెలిపారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్ అనిత, సర్పంచ్ కిరణ్, ఉపసర్పంచ్ యశోద, కార్యదర్శి సిద్ధిక్‌మియా, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు కళ్యాణి, నందిని, నాగేంద్రమ్మ, సుభాషిణి, సత్యవతి, వరలక్ష్మి, రోహిణితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నూతనకల్లులో అయ్యప్ప స్వామి ఆలయ ప్రతిష్టాపన

## మాజీ స్పీకర్ మధుసూదనాచారికి ఆహ్వానం

**తల్లాడ/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండలంలోని నూతనకల్లు గ్రామంలో ఈ నెల 16న నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్టాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని తెలంగాణ తొలి స్పీకర్, మాజీ శాసనసభ్యులు సిరికొండ మధుసూదనాచారిని ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో తల్లాడ



మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రుద్రాక్ష నరసింహాచారి, గౌరవ అధ్యక్షుడు గంటల వెంకటాచారి మర్యాదపూర్వకంగా కలిసి ప్రతిష్టాపన మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమ వివరాలను ఆయనకు వివరించి, తప్పక హాజరుకావాలని కోరారు. దీనికి మధుసూదనాచారి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

# ఇండోర్ స్టేడియాన్ని పునఃప్రారంభించాలి

## జాతీయ స్థాయి పారా క్రీడాకారుడు సిద్ధార్థ్ నాయక్

**స్టేషన్ ఘన్‌పూర్/అక్టోబర్ 05 (జర్నలిస్ట్ వార్త):** స్టేషన్ ఘన్‌పూర్ పట్టణంలోని శివుని పెళ్లి ప్రాంతం నుంచి నమిలిగొండ వెళ్లే మార్గంలో ఉన్న ఇండోర్ స్టేడియాన్ని వెంటనే పునఃప్రారంభించాలని జాతీయ స్థాయి పారా క్రీడాకారుడు సిద్ధార్థ్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. కమ్యూనిటీ ప్లాంటేషన్ వర్క్ ఐడీ 1481తో ఉన్న ఇండోర్ స్టేడియం1ను అందుబాటులోకి తీసుకొస్తే ఘన్‌పూర్ పరిధిలోని గ్రామాలు, పల్లెలు, తండాలకు చెందిన వందలాది మంది క్రీడాకారులకు శిక్షణ పొందే అవకాశం కలుగుతుందన్నారు. స్టేడియం వినియోగంలో లేకపోవడంతో క్రీడాకారులు శిక్షణకు దూరమై రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించలేకపోతున్నారని



తెలిపారు. అధికారులు స్పందించి స్టేడియానికి అవసరమైన మరమ్మతులు చేపట్టి పునఃప్రారంభించాలని, స్థానిక క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాలని సిద్ధార్థ్ నాయక్ కోరారు.

## పత్తి కొనుగోలు కౌంటర్ ప్రారంభించిన కాంగ్రెస్ నాయకులు

### నాణ్యమైన పత్తికి క్వింటాలుకు రూ.7,500 నుంచి రూ.8 వేల వరకు ధర



**తల్లాడ/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** తల్లాడ సొసైటీ ఆవరణలో పత్తి కొనుగోలు కౌంటర్‌ను కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ప్రారంభించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, దుండేటి వీరారెడ్డి, తాళ్ల జోసెఫ్ తదితరులు కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు షేక్ నిజాముద్దీన్ (చికెన్ బచ్చ) మాట్లాడుతూ నాణ్యతను బట్టి పత్తికి క్వింటాలుకు రూ. 7,500 నుంచి రూ. 8 వేల వరకు ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. రైతుల నుంచి నాణ్యమైన పత్తిని కొనుగోలు చేసి మంచి ధర అందించడమే లక్ష్యంగా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని రైతులు తమ పత్తిని సకాలంలో కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి విక్రయించుకోవాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో నారపోగు ప్రసాద్‌బాబు, వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పంచాయతీ నిబంధనలకు తూట్లు

### అర్హులకు అన్యాయం జరగొద్దు: బిచ్చా నాయక్‌తండా సర్పంచ్ రవి నాయక్




**కేసముద్రం/అక్టోబర్ 05 (జర్నలిస్ట్ వార్త):** ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియలో గ్రామ పంచాయతీ పాలకవర్గానికి సమాచారం లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ బిచ్చా నాయక్‌తండా సర్పంచ్ రవి నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో గుడిసెల్లో నివసిస్తున్న 12 మంది నిరుపేదలను గుర్తించి వారి పేర్లతో జాబితాను ఉన్నతాధికారులకు అందజేసినప్పటికీ, దానిని పరిగణనలోకి తీసుకోకుండా ఇళ్ల మంజూరు ప్రక్రియ చేపట్టడం సరికాదన్నారు. గ్రామసభ ద్వారా అర్హుల ఎంపిక జరగాల్సి ఉండగా స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం లేకుండా నిర్ణయాలు తీసుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇల్లు లేని నిరుపేదలు, గుడిసెల్లో నివసిస్తున్న వారి పరిస్థితులు స్థానిక ప్రజాప్రతినిధులకు స్పష్టంగా తెలుస్తాయని తెలిపారు. తాము అందజేసిన జాబితాను పునఃపరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై ఉన్నతాధికారులను కలిసి వివరించేందుకు ప్రయత్నించినా స్పందన లభించలేదని సర్పంచ్ పేర్కొన్నారు. జిల్లా అధికారులు స్పందించి 12 మంది నిరుపేదల జాబితాను పరిశీలించి, అర్హత ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించి తగిన శిక్షణ ఇవ్వాలి

### హసన్‌పర్తి ఎంఈఓ ఏ. శ్రీనివాస్







**హసన్‌పర్తి/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** విద్యార్థుల్లో దాగి ఉన్న సహజ నైపుణ్యాలు, ఆసక్తులను గుర్తించి వాటికి అనుగుణంగా తగిన శిక్షణ అందించాలని హసన్‌పర్తి మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలంలోని స్కిల్ స్టార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మూడు రోజులపాటు నిర్వహించనున్న కౌశల్ బోధ్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎంఈఓ శ్రీనివాస్ ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన వృత్తి విద్యా బోధకులు, ఎంపిక చేసిన సుమారు 120 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సహజ సామర్థ్యాలు, ఆసక్తులు, నైపుణ్యాలను ఉపాధ్యాయులు గుర్తించి వారిని ప్రోత్సహించాలన్నారు. అకడమిక్ విద్యతోపాటు వృత్తి విద్యా నైపుణ్యాలను అందించడం ద్వారా భవిష్యత్తులో విద్యార్థులు ఉపాధి అవకాశాలను సులభంగా అందిపుచ్చుకునేలా చేయవచ్చన్నారు. విద్యార్థుల్లో ఆసక్తిని గుర్తించి సరైన దిశలో తీర్చిదిద్దడం ఉపాధ్యాయుల బాధ్యత అని తెలిపారు. చేసి నేర్చుకునే విధానం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల ఉపాధ్యాయులు, వృత్తి విద్యా బోధకులు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎస్సీ హాస్టల్ విద్యార్థుల భోజన వసతులపై తహసీల్దార్ ఆరా.






**బయ్యారం/,అక్టోబర్ 5.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌ను సోమవారం సాయంత్రం తహసీల్దార్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న వసతులు, పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందో లేదో తెలుసుకునేందుకు స్వయంగా విద్యార్థులతో కలసి కూర్చొని భోజనం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థుల భోజన విషయంలో ఎలాంటి అలసత్వం వహించవద్దని హాస్టల్ నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. హాస్టల్‌లోని తాగునీరు, విద్యుత్, వసతి తదితర సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ చిరంజీవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములపై బై నంబర్ల బాగోతం!

### 22ఏలో చేర్చకపోతే కబ్జాలకు తలుపులు తెరిచినట్టే.. -అధికారుల తీరుపై ఎల్లాపూర్ గ్రామస్తుల ఆగ్రహం

**హసన్‌పర్తి/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు మౌనం వహిస్తే ఆక్రమణదారులకు అడ్డూ అదుపూ లేకుండా పోతుందని ఎల్లాపూర్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అవసరాలకు కేటాయించి మిగిలిన భూములకు వరుసగా బై నంబర్లు సృష్టించారన్న ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని సామాజిక ఉద్యమకారుడు రేణుకుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ డిమాండ్ చేశారు.
65వ డివిజన్ ఎల్లాపూర్‌లోని సర్వే నంబర్ 316లో గతంలో గ్రామపంచాయతీ అంగడి ఉండగా పశువుల దవాఖానకు 10 గుంటలు, అంబేద్కర్ కమిటీ హాల్‌కు 5 గుంటలు, పాఠశాల మైదానానికి ఎకరం భూమిని కేటాయించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. మిగిలిన సుమారు మూడు ఎకరాలను గ్రామ, ప్రభుత్వ అవసరాల కోసం ఉంచినట్లు పేర్కొన్నారు. అయితే ఈ భూమికి 316/ఈ/2/1 నుంచి సుమారు 30 వరకు బై నంబర్లు ఎలా వచ్చాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. అదేవిధంగా సర్వే నంబర్ 246లో 246/1/ఈ/1 నుంచి 9 వరకు బై నంబర్లు సృష్టించినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ పరిధిలో ఉన్న కలగిరిబంగుల గోదాం, చేపల ఉత్పత్తి కేంద్రానికి సంబంధించిన నిర్మాణాలను నేలమట్టం చేసినట్లు వారు చెబుతున్నారు. ప్రభుత్వ భూముల విషయంలో ఇంతటి పరిణామాలు చోటుచేసుకున్నా సంబంధిత అధికారులు ఇప్పటివరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నిస్తున్నారు.

**ఐదేళ్లుగా వినతులు.. ఫలితం శూన్యం**

ఈ భూముల పరిరక్షణ కోసం గత ఐదేళ్లుగా అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నామని దుర్గాప్రసాద్




తెలిపారు. తాజాగా సోమవారం ప్రజావాణిలో కలెక్టర్, తహసీల్దార్‌కు మరోసారి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ భూములపై ఉన్న రికార్డులను పరిశీలించి, బై నంబర్ల సృష్టికి సంబంధించిన పత్రాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

**22ఏలో చేర్చితేనే కబ్జాలకు చెక్**

ప్రభుత్వ గ్రామపంచాయతీ అంగడి, గ్రామపంచాయతీ చేపల ఫారం వంటి ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు. భూముల హద్దులు, రికార్డులు, పాత రిజిస్టర్లు, బై నంబర్ల సృష్టి ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమంగా భూములు చేతులు మారి ఉంటే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరుతున్నారు.

**అధికారులు స్పందిస్తారా?**

ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యే వరకు వేచి చూసి ఆ తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే రికార్డులను పరిశీలించి రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఎల్లాపూర్‌లోని ప్రభుత్వ భూములపై వచ్చిన ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు




ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణకు ఆదేశిస్తారా? లేక ఫిర్యాదులు, వినతిపత్రాలు యథావిధిగా ఫైళ్లకే పరిమితమవుతాయా? అనేది వేచి చూడాల్సి ఉంది.

## బయ్యారం టీచర్స్ మోడల్ సొసైటీ అధ్యక్షుడిగా జి.రామారావు ఎన్నిక.

**బయ్యారం/,అక్టోబర్ 5.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మండల కేంద్రంలో 20 మంది ఉపాధ్యాయ సభ్యులతో ఏర్పాటు చేసిన 'బయ్యారం టీచర్స్ మోడల్ సొసైటీ' సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జి.లక్ష్మణ్ రావును సొసైటీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి. రామారావు, కార్యదర్శిగా జి.హిమాచల్ శ్రీరామ్, కోశాధికారిగా ఎం.నరసింహారావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన ప్రతినిధులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పరస్పర సహకారం, ఆర్థిక ప్రగతి, సంక్షేమమే ధ్యేయంగా ఈ సొసైటీ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్రావు, కిషన్, ప్రవీణ్, రమేష్, మధుబాబు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మట్టి తవ్వకాలతో బలవుతున్న ప్రాణాలు!

### మట్టిలో కలిసిపోతున్న మనుషులు.. అయినా మేలుకోని అధికారులు?

### నిబంధనలు పాటిస్తున్నారా? ప్రమాదాల నివారణకు చర్యలేవి?

**సత్తుపల్లి/అక్టోబర్ 5 (జర్నలిస్టు వార్త):** మట్టి తవ్వకాల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న పనులు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అనుమతులు, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ నిబంధనలు పాటించకుండా తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సత్తుపల్లి టౌన్ బీజేపీ అధ్యక్షుడు విజయ్ డిమాండ్ చేశారు.
తాజాగా కల్లూరు మండలం వెన్నవల్లి గ్రామంలో మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో మట్టి చరియలు విరిగిపడటంతో ఖమ్మంకు చెందిన రవి అనే ఎక్స్కవేటర్ డ్రైవర్ మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. పొట్టకూటి కోసం పనికి వచ్చిన కార్మికుడు ప్రాణాలు కోల్పోవడంతో ఆయన కుటుంబం దిక్కుతోచని స్థితిలోకి వెళ్లింది. ఈ ఘటన మట్టి తవ్వకాల ప్రాంతాల్లో కార్మికుల భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.
మరోవైపు కొద్ది రోజుల క్రితం సత్తుపల్లి శివారులో మట్టి కోసం తవ్విన గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఇద్దరు చిన్నారులు అందులో పడి మృతి చెందిన ఘటన కూడా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. తవ్వకాలు పూర్తయిన తర్వాత భారీ గుంతలను అలాగే వదిలేయడం వల్ల వర్షాకాలంలో అవి ప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**తవ్వకాలు.. గుంతలు.. ప్రమాదాలు**

మట్టి తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? అనుమతించిన పరిమితుల్లోనే తవ్వకాలు



జరుగుతున్నాయా? తవ్వకాల ప్రాంతాల్లో భద్రతా చర్యలు తీసుకున్నారా? తవ్వకాలు పూర్తయిన తర్వాత గుంతలను పూడ్చారా? సమీప నివాస ప్రాంతాలకు, ప్రజలకు ప్రమాదం లేకుండా చర్యలు చేపట్టారా? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

**టిప్పర్లతో రహదారులపై ముప్పు**

మట్టి తరలించే టిప్పర్ల రాకపోకలతో రహదారులపై కూడా ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. అధిక లోడుతో మట్టి తరలించడం, అతివేగంగా వాహనాలు నడపడం, రహదారులపై మట్టి పడుతున్నా వెంటనే తొలగించకపోవడం వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. మట్టి రవాణా వాహనాల అనుమతులు, లోడ్ పరిమితులు, వాహనాల ఫిట్‌నెస్, డ్రైవర్ల అర్హతలను అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

**ఫిర్యాదులు వస్తున్నా.. చర్యలు ఎక్కడ?**

సత్తుపల్లి ప్రాంతంలో మట్టి తవ్వకాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు సంబంధిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి అనుమతులు, తవ్వకాల పరిమితులు, భద్రతా ప్రమాణాలను పరిశీలించాలని కోరుతున్నారు.
తనిఖీల సమాచారం ముందుగానే అక్రమ తవ్వకందారులకు చేరుతోందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత అన్నది ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరిపి తేల్చాల్సిన అవసరం ఉంది.

**కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలి**

తాజా ఘటనల నేపథ్యంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ సత్తుపల్లి, కల్లూరు ప్రాంతాల్లో జరుగుతున్న మట్టి తవ్వకాలు, మట్టి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. మట్టి తవ్వకాలకు సంబంధించిన అనుమతులు, లీజులు, తవ్వకాల పరిమితులు, రవాణా వాహనాల వివరాలను పరిశీలించేందుకు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.
నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత వ్యక్తులు, సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ తవ్వకాలకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల పాత్రపైనా ఉన్నతస్థాయి విచారణ జరపాలని కోరుతున్నారు.
ప్రాణాలు పోయిన తర్వాత స్పందించడం కంటే ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రమాదకరంగా మారిన గుంతలను వెంటనే పూడ్చడంతో పాటు మట్టి తవ్వకాలు, మట్టి రవాణాపై కఠిన నిఘా ఏర్పాటు చేసి మరో ప్రాణం మట్టిలో కలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## రైతుల సమక్షంలో పారదర్శకంగా భూ రీ-సర్వే.

### -మండల సర్వేయర్ శివయ్య.

**బయ్యారం/,అక్టోబర్ 5.(జర్నలిస్ట్ వార్త)**



బయ్యారం మండలం సింగారం రెవిన్యూ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన భూ రీ-సర్వే ప్రక్రియ సోమవారం నుండి ప్రారంభమైందని మండల సర్వేయర్ శివయ్య తెలిపారు. దీనిలో భాగంగా మొదటగా గ్రామ సరిహద్దు సర్వే చేపట్టనున్నట్లు వారు తెలిపారు. ఆ తర్వాత క్రమంగా ప్రభుత్వ భూములు, రైతుల పట్టా భూముల సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. సర్వే ప్రక్రియ పారదర్శకంగా ఎలాంటి సరిహద్దు వివాదాలు లేకుండా సాగేందుకు రైతులందరూ తమ భూముల వద్ద ప్రత్యక్షంగా హాజరుకావాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో సింగారం గ్రామ సర్పంచ్ సపవత్ సరస్వతి రాందాస్ నాయక్, ఏఈఓ నాగరాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దళిత యువతిపై అఘాయిత్య ఆరోపణలు

### నిష్పక్షపాత విచారణ జరపాలి - పసునూరి మురళి

**వర్ధన్నపేట/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):**
వర్ధన్నపేటకు చెందిన దళిత యువతిపై అఘాయిత్యానికి పాల్పడ్డారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని ఎంజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసునూరి మురళి డిమాండ్ చేశారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని, గర్భం దాల్చిన అనంతరం అబార్షన్ చేయించారనే ఆరోపణలపై నిజానిజాలు తేల్చాలన్నారు. రాజకీయ పలుకుబడి ఉన్నా చట్టానికి ఎవరూ అతీతులు కాదని పేర్కొన్నారు. బాధితురాలిపై ఒత్తిడి లేకుండా పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. దళితబహుజన, మహిళా సంఘాలు బాధితురాలికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.



# బయోగ్యాస్ దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి

## ప్యాక్టరీ మూసివేయాలని గ్రామస్థుల డిమాండ్ -ఎంపీడీవోకు వినతిపత్రం







**ఎల్కతుర్తి/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలం సూరారం సమీపంలోని రిలయన్స్ బయోగ్యాస్ ప్యాక్టరీ నుంచి వెలువడుతున్న దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పరిసర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్యాక్టరీ నుంచి ఉదయం మధ్యాహ్నం రాత్రి సమయాల్లో దుర్వాసన వస్తోందని దీనివల్ల జనావాసాల్లో అసౌకర్యకర పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు. ప్యాక్టరీ కార్యకలాపాలపై అధికారులు సమగ్రంగా విచారణ జరిపి నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో ఎన్ విజయకుమార్‌కు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారుసుమారు 100 మంది గ్రామస్థులు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. జనావాసాలకు సమీపంలో ప్యాక్టరీ ఉండటంతో ప్రజల ఆరోగ్యం భద్రత పర్యావరణంపై ఆందోళన నెలకొందని వారు పేర్కొన్నారు. ప్యాక్టరీ నుంచి వెలువడుతున్న దుర్వాసనతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కొందరు గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు

ఈ సందర్భంగా టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్ మాజీ సర్పంచ్ సాంబమూర్తి గౌడ్ మాట్లాడుతూ ప్యాక్టరీ నుంచి వెలువడుతున్న వాయువులు దుర్వాసనపై అధికారులు శాస్త్రీయంగా పరిశీలన చేయాలని కోరారు. దుర్వాసనకు కారణమేమిటో పర్యావరణానికి లేదా ప్రజారోగ్యానికి ఏమైనా ప్రభావం ఉందా అనే అంశాలను సంబంధిత శాఖల అధికారులు పరీక్షించాలని విజ్ఞప్తి చేశారు. ప్యాక్టరీలో గ్యాస్ లీకేజీలు వ్యర్థాల నిర్వహణ శబ్ద కాలుష్యం తదితర అంశాలపై తనిఖీలు నిర్వహించాలని కోరారు

వల్భాపూర్ సూరారం వీరనారాయణపూర్ ఎల్కతుర్తి గ్రామాల వైపు దుర్వాసన వస్తోందని గ్రామస్థులు తెలిపారు. ప్యాక్టరీ నిబంధనలకు అనుగుణంగా నడుస్తుందా లేదా అనే అంశంపై కాలుష్య నియంత్రణ శాఖతోపాటు సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అవసరమైతే జనావాసాలకు దూరంగా తరలించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు

కార్యక్రమంలో సర్పంచ్ భాషబోయిన నీల పిట్టల మహేందర్ మాజీ సర్పంచ్ సాంబమూర్తి గౌడ్ మహేందర్ ప్రహ్లాదరావు హింగే భాస్కర్ రవీందర్ వేణు తదితరులు వార్డు సభ్యులు గ్రామ యువకులు పాల్గొన్నారు

# భూదాన పత్రంపై విచారణ జరపాలి






**వర్ధన్నపేట/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట రామాలయం పరిసరాల్లోని తమ వారసత్వ భూమిని కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా వినియోగిస్తున్నారని భూ యజమాని గురిజాల ప్రశాంత్ ఆరోపించారు. తన తండ్రి మానసిక అనారోగ్యంతో ఉన్న సమయంలో ఆయనతో భూదాన పత్రం రాయించుకున్నారని, కుటుంబ సభ్యుల సంతకాలు లేవని పేర్కొన్నారు. భూదాన పత్రం చట్టబద్ధత, భూమిలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు అనుమతులపై విచారణ జరపాలని కోరారు. పనులపై ప్రశ్నించగా మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి దురుసుగా మాట్లాడి బెదిరించారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై చైర్మన్ వివరణ వెల్లడించాల్సి ఉంది.

# మహిళా ఉద్యోగినిని దూషించిన వారిని అరెస్టు చేయాలని వినతి




**పర్వతగిరి/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పీకే మల్లేపల్లిలో గ్రామసభ సందర్భంగా వీవోఏ మాధవిపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని పర్వతగిరి మదర్ థెరిస్సా మండల సమాఖ్య వీవోఏలు డిమాండ్ చేశారు. సోమవారం కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, సెర్ప్ ఏపీఎం రాజీర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామసభలో మహిళా వీవోఏను అసభ్య పదజాలంతో దూషించి, భౌతికంగా దాడి చేశారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బాధ్యులు యాక స్వామి, లావణ్య, కవిత, విజేందర్, జోష్న, సీసీలు దేవేంద్ర, సుధాకర్, శ్యాసన్, కొమురయ్య, రాధిక, అరుణ, వీవోఏలు రజిత, జ్యోతి, శైలజ, స్వప్న, రమేష్, రాణి, రాజు, సీఈవో శ్రీనివాస్, సూర్యోదయ ఏపీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సమాయత్తం

## సేవా జ్యోతి యాత్ర, సన్నాహక సమావేశం -అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై ఆరా





**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరోఅక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ శ్రేణులు క్షేత్రస్థాయిలో సమాయత్తం కావాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ధర్మసాగర్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ అధ్యక్షతన సోమవారం సేవా జ్యోతి యాత్ర, ఎమ్మెల్సీ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ గుండె విజయరామారావు హాజరై పార్టీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

సేవా జ్యోతి యాత్ర ఉద్దేశాలు, నిర్వహించాల్సిన కార్యక్రమాలపై జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలోని అంజిరెడ్డి కార్యకర్తలకు వివరించారు. గ్రామస్థాయిలో ప్రజలను కలుస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఇన్‌చార్జి నిర్మల అమరేందర్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన సన్నాహక కార్యక్రమాలు, ఓటర్లను సమన్వయం చేసుకునే విధానం, పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణపై వివరించారు.

**అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన**

కార్యక్రమంలో భాగంగా మహిళా మోర్చా నాయకులు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ఆహార నాణ్యత, ఇతర సౌకర్యాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వారు అభినందించారు. ఈ సందర్భంగా పౌష్టికాహార కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.

**బీఎల్‌వోలకు సన్మానం**

అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బీఎల్‌వోలుగా పనిచేసి సేవలందించిన వారిని డాక్టర్ గుండె విజయరామారావు, మహిళా మోర్చా నాయకులు శాలువాలతో సన్మానించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో బీఎల్‌వోల సేవలు కీలకమని నాయకులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలోని అంజిరెడ్డి, శ్యాంసుందర్, దుర్గాప్రసాద్, బట్టి శివప్రసాద్‌రెడ్డి, చింత రఘువీర్, బీజేవైఎం నాయకుడు గొంగడి సందీప్, గంగారం రమేష్, మారి రాజేందర్, వెంకటి, వెంకటరెడ్డి, పూల శ్రీనివాస్, సాయం సందీప్‌తో పాటు మహిళా మోర్చా నాయకులు, మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

# చైర్మన్ ఇంటి ముందు యువతి ఆందోళన

## ప్రేమ వ్యవహారంపై న్యాయం చేయాలంటూ బైఠాయింపు.. రాత్రి వరకు కొనసాగిన నిరసన







**వర్ధన్నపేట/అక్టోబర్ 5(జర్నలిస్ట్ వార్త):** ప్రేమ వ్యవహారంలో తనకు న్యాయం చేయాలంటూ ఓ యువతి వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి ఇంటి ఎదుట సోమవారం ఆందోళనకు దిగింది. చైర్మన్ కుమారుడు శ్రీకాంత్‌పై ఆమె ఆరోపణలు చేసింది. కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు టెంట్ ఏర్పాటు చేసుకుని వంటావార్పు చేపట్టింది. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆందోళన విరమించబోమని కుటుంబ సభ్యులు తెలిపారు.

యువతికి మద్దతుగా బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, పలువురు ప్రముఖులు సంఘీభావం తెలిపారు. మాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మిద్దెపాక రవీందర్ కూడా వివిధ పార్టీల నాయకులతో కలిసి సంఘీభావం ప్రకటించారు. గతంలో తన సమస్యపై ఎమ్మెల్యేను ఆశ్రయించినా పరిష్కారం కాలేదని యువతి తెలిపింది.

సమాచారం అందుకున్న ఎస్సై రాజు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని యువతి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సమస్యకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే, అందిన వివరాల ఆధారంగా నిబంధనల ప్రకారం పరిశీలిస్తామని సూచించారు. పోలీసులకు ఫిర్యాదు చేయబోమని, శ్రీకాంత్ వివాహం చేసుకుంటామని హామీ ఇస్తే ఆందోళన విరమిస్తామని కుటుంబ సభ్యులు తెలిపినట్లు సమాచారం.

ఉదయం మొదలైన నిరసన రాత్రి వరకు కొనసాగింది. టెంట్ కిందనే వంట చేసుకుని కుటుంబ సభ్యులు అక్కడే ఉన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షణ కొనసాగించారు. యువతి చేసిన ఆరోపణలపై చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, ఆయన కుమారుడు శ్రీకాంత్ నుంచి అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. ఇరుపక్షాల వాదనలు, అందుబాటులో ఉన్న ఆధారాలు, పోలీసులకు అందే ఫిర్యాదు ఆధారంగా తదుపరి చర్యలు ఉండనున్నాయి.




# ప్రేమ పేరుతో జీవితాన్ని పణంగా పెట్టొద్దు!

## నమ్మకం,ఆలోచన ఉండాలి



ప్రేమలో పడటం తప్పు కాదు. కానీ ప్రేమ పేరుతో కళ్లు మూసుకోవడమే అసలు ప్రమాదం. మూడు సంవత్సరాలుగా ఓ వ్యక్తిని ప్రేమించి, అతడే తన జీవితమని నమ్మి, తనకు ఉన్నదంతా ఖర్చు చేసిన ఓ యువతి చివరకు న్యాయం కోసం బహిరంగంగా ఆందోళనకు దిగిన ఘటన యువతను ఆలోచింపజేస్తోంది. ప్రేమలో ఉన్నప్పుడు ఎదుటి వ్యక్తి చెప్పే ప్రతి మాట నిజమే అనిపిస్తుంది. అతడి మాటే భరోసాగా, అతడి హామీనే భవిష్యత్తుగా కనిపిస్తుంది. జీవితాన్ని పంచుకోబోయే వ్యక్తి కోసం ఎంతైనా ఖర్చు చేయొచ్చని భావించడం కూడా అదే నమ్మకంలో భాగమవుతుంది. ప్రేమను డబ్బుతో నిరూపించాల్సిన అవసరం లేదు. నిజమైన ప్రేమకు లెక్కలు ఉండవు. స్వార్థం ఉండదు.ప్రేమిస్తున్నానని చెప్పి పదేపదే డబ్బులు అడిగితే అది ప్రేమా, అవసరమా, లేక నమ్మకాన్ని ఉపయోగించుకోవడమా అనే ప్రశ్న వేసుకోవాలి. పెళ్లి చేసుకుంటానని చెప్పి సంవత్సరాల తరబడి ఆశలు కల్పిస్తే ఆ హామీ ఎంతవరకు నిజమో ఆలోచించాలి. ఒక్క వ్యక్తినే నమ్మి చదువు, ఉద్యోగం, కుటుంబం, ఆర్థిక భద్రత వంటి వాటిని పక్కన పెట్టడం భవిష్యత్తుకు ముప్పుగా మారొచ్చు. ప్రేమలో ఉండటం అంటే ఆలోచనను పక్కన పెట్టడం కాదు. గుండెకు ఎంత ప్రాధాన్యం ఉంటుందో మెదడుకూ అంతే ప్రాధాన్యం ఉండాలి. నమ్మకం ఉండాలి. అదే సమయంలో ప్రశ్నించే ధైర్యం కూడా ఉండాలి. అనురాగం ఉండాలి. ఆత్మగౌరవం మాత్రం కోల్పోకూడదు. త్యాగం ఉండాలి. స్వీయ నాశనం మాత్రం కాకూడదు.

ముఖ్యంగా యువతులు తమ భవిష్యత్తును ఒకరి చేతుల్లో పూర్తిగా పెట్టకూడదు. చదువు, ఉద్యోగం, ఆర్థిక స్వావలంబన, కుటుంబ బంధాలు, ఆత్మగౌరవం జీవితానికి పునాదులు. ప్రేమ పేరుతో వాటిని ఒక్కొక్కటిగా వదులుకోవడం త్యాగం కాదు. భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడమే.

యువకులూ ఇదే విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఒక యువతి తనను నమ్మిందని ఆ నమ్మకాన్ని బలహీనతగా చూడకూడదు. ప్రేమలో హామీ ఇస్తే దానికి బాధ్యత వహించాలి. సంబంధం విషయంలో స్పష్టత, నిజాయితీ, పరస్పర గౌరవం ఉండాలి. తల్లిదండ్రుల పాత్ర కూడా ఇక్కడ కీలకమే. పిల్లలు ప్రేమ గురించి మాట్లాడితే మందలించడం కంటే, ఆ సంబంధాన్ని అర్థం చేసుకునేలా వారితో మాట్లాడాలి. సమస్య ఎదురైతే బయటకు వెళ్లకుండా ముందుగా కుటుంబాన్ని ఆశ్రయించే నమ్మకం కల్పించాలి.

ఈ ఘటనలో యువతి చేసిన ఆరోపణలపై నిజానిజాలు విచారణలో తేలాల్సి ఉంది. ఎవరినీ ముందుగానే దోషిగా నిర్ధారించడం సమంజసం కాదు. అయితే ఈ ఘటన లేవనెత్తుతున్న ప్రశ్న మాత్రం ప్రతి ఇంటికీ, ప్రతి యువతకూ సంబంధించినదే.ప్రేమ కోసం డబ్బు పోగొట్టుకోవచ్చు. కోల్పోయిన డబ్బును తిరిగి సంపాదించుకోవచ్చు. సంబంధం విఫలమైతే జీవితాన్ని మళ్లీ నిర్మించుకోవచ్చు. కోల్పోయిన సంవత్సరాలు, దెబ్బతిన్న ఆత్మగౌరవం, చేజారిన అవకాశాలను తిరిగి తెచ్చుకోవడం అంత సులభం కాదు.అందుకే యువతా. ప్రేమించు, కానీ ఆలోచించి ప్రేమించు. నమ్ము. కానీ నిన్ను నువ్వు కోల్పోయేంతగా కాదు. నిన్ను నిజంగా ప్రేమించే వ్యక్తి నీ జీవితాన్ని తన చేతుల్లోకి తీసుకోడు. నీ జీవితాన్ని నీతో కలిసి నిర్మిస్తాడు.ఒకరిని ప్రేమించే ముందు నిన్ను నువ్వు ప్రేమించుకో. ఎందుకంటే నీ జీవితం ఎవరి ప్రేమకు బహుమతి కాదు. నీకు నువ్వు ఇచ్చుకున్న అమూల్యమైన వరం. దాన్ని ప్రేమ పేరుతో పణంగా పెట్టొద్దు.



బిర్రు కరుణాకర్ జర్నలిస్ట్ వార్త ఎడిటర్
సీనియర్ జర్నలిస్ట్
సెల్ ఫోన్ నంబర్ :9701249103

# రక్షణ, ఏవియేషన్‌లోనూ 'టెంపుల్!

**హెల్త్ ట్రాకింగ్‌ను దాటి ఏవియేషన్, రక్షణ రంగాల్లోకి జొమాటో 'టెంపుల్'**

**పైలట్ల ఫిట్‌నెస్, సైనికుల సామర్థ్యం అంచనాకు ఈ డివైజ్ ఉపయోగం**

**భవిష్యత్తులో ఆలోచనలను టెక్స్ట్‌గా మార్చే టెక్నాలజీపై పరిశోధన**

**ప్రస్తుతం మెదడుకు రక్తప్రసరణను ట్రాక్ చేసే 'బ్రెయిన్‌ఫ్లో' ఫీచర్‌పై దృష్టి**



**అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** ప్రముఖ ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ 'జొమాటో' త్వరలో 'టెంపుల్' పేరుతో సరికొత్త వేరబుల్ డివైజ్‌ను మార్కెట్‌లోకి తీసుకురానుంది. ఈ పరికరం కేవలం ఆరోగ్య పర్యవేక్షణకే పరిమితం కాకుండా, భవిష్యత్తులో విమానయాన, రక్షణ వంటి కీలక రంగాల్లో ఉపయోగపడే అపారమైన అనువర్తనాలను కలిగి ఉందని జొమాటో వ్యవస్థాపకుడు దీపిందర్ గోయల్ వెల్లడించారు. అత్యంత క్లిష్టమైన విధుల్లో నిమగ్నమయ్యే వ్యక్తుల శారీరక దృఢత్వాన్ని అంచనా వేయడానికి ఈ డివైజ్ ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా నెటిజన్లతో సంభాషిస్తూ గోయల్ పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. విమానం నడపడానికి పైలట్లు ఎంతవరకు ఫిట్‌గా ఉన్నారు? నిర్దిష్ట సైనిక చర్యలకు ఏ జవాను అత్యంత సమర్థుడు? వంటి విషయాలను గుర్తించడానికి ఈ పరికరం ఎంతగానో దోహదపడుతుందని ఆయన వివరించారు. రెస్టారెంట్ల సిబ్బంది ఎదుర్కొనే ఒత్తిడిని పర్యవేక్షించవచ్చన్న ఒక యూజర్ చేసిన సూచనకు స్పందిస్తూ గోయల్ ఈ వివరణ ఇచ్చారు.

మానవ ఆలోచనలను అక్షర రూపంలోకి మార్చగల వినూత్న సాంకేతికతపై తమ పరిశోధక బృందం పనిచేస్తోందని గోయల్ వెల్లడించడం విశేషం. అయితే, ఈ టెక్నాలజీ అందుబాటులోకి రావడానికి మరికొన్నేళ్లు పట్టవచ్చని, బహుశా 'టెంపుల్' మూడవ లేదా నాలుగవ వెర్షన్‌లో ఇది సాధ్యం కావచ్చని ఆయన అంచనా వేశారు. ప్రస్తుతానికి ఈ డివైజ్ ప్రధానంగా ఫిజికల్ బాడీ సెన్సింగ్, ఆరోగ్య పర్యవేక్షణపైనే దృష్టి సారించింది. ముఖ్యంగా మెదడుకు జరిగే రక్తప్రసరణలో మార్పులను నిరంతరం ట్రాక్ చేసే 'బ్రెయిన్‌ఫ్లో' ఫీచర్ ఇందులో కీలక పాత్ర పోషించనుంది. ఇటీవల 60 మందిపై నిర్వహించిన అధ్యయనంలో ఈ టెక్నాలజీ అత్యంత కచ్చితత్వంతో పనిచేస్తున్నట్లు నిరూపితమైందని గోయల్ పేర్కొన్నారు.

## పవన్ కల్యాణ్ ఆదేశాలతో ఇంద్రకీలాద్రిపై ప్రధాని మోదీ పేరిట పూజలు



**అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 7వ తేదీన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రధాని మోదీ పేరిట ఈ పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేశ్ ఈ పూజలను నిర్వహిస్తున్నారు. 2001లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రధాని మోదీ ప్రజా ప్రస్థానం ప్రారంభమైంది. అప్పటి నుంచి 2014లో దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి, 25 ఏళ్లుగా తన సేవలను దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు. ఈ మైలురాయిని పురస్కరించుకుని, ప్రధాని మోదీకి అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులు లభించాలని, ఆయనకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ఈ పూజలు జరపనున్నారు. దేశాన్ని 'వికసిత్ భారత్' లక్ష్యం వైపు నడిపిస్తున్న ఆయన నాయకత్వం మరింత బలోపేతం కావాలన్నది ఈ పూజల ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారి అంతరాలయంలో అత్యంత విశిష్టమైన 'ఖడ్గమాల అర్చన'ను ప్రధాని పేరిట జరపనున్నారు. జగద్గురువు ఆది శంకరాచార్యులు ఇంద్రకీలాద్రిపై ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో పూజలు నిర్వహిస్తే అమ్మవారి అనుగ్రహంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, రక్షణ, శాంతి, సంకల్పసిద్ధి కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ప్రధాని మోదీ నిరంతర దేశ సేవకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని, ఆయన నాయకత్వంలో భారతదేశం మరింత సుసంపన్నమైన, ఆత్మనిర్భర దేశంగా ఎదగాలన్న సంకల్పంతో ఎంపీ లింగమనేని రమేశ్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పూజల ద్వారా ప్రధానికి సంపూర్ణ ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలు లభించాలని ఆకాంక్షించారు.

# సంజయ్ దత్ వ్యాఖ్యలపై రాజకీయ దుమారం..

**అండగా నిలిచిన కాంగ్రెస్**

**దేశంలో మునుపటి శాంతి కనిపించడం లేదన్న సంజయ్ దత్**

**సంజయ్ వ్యాఖ్యలకు మద్దతు తెలిపిన కాంగ్రెస్**

**బీజేపీ పాలనలో ప్రజలకు భద్రత లేదని ఆరోపణ**

**తన వ్యాఖ్యలు సరదాగా చేసినవని సంజయ్ దత్ వివరణ**

**ఇక్కడ నచ్చని వారు వెళ్లిపోవచ్చన్న శివసేన నేత**



**అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెను దుమారాన్ని రేపాయి. దేశంలో మునుపటిలా శాంతియుత వాతావరణం కనిపించడం లేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచింది. బీజేపీ ప్రభుత్వాల హయాంలో ప్రజలకు భద్రత కరవైందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. అయితే, తన వ్యాఖ్యలు కేవలం సరదా సంభాషణలో భాగమని సంజయ్ దత్ తర్వాత వివరణ ఇచ్చారు.

కాంగ్రెస్ నేత నానా పటోలే మాట్లాడుతూ, సంజయ్ దత్ "నికార్సయిన నిజం" పలికారన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో పట్టపగలే హత్యలు జరుగుతున్నాయని, ప్రజలు అభద్రతాభావంతో ఉన్నారని ఆరోపించారు. ప్రజల ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని ఆయన సూచించారు. మరో కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ కూడా సంజయ్ దత్‌కు మద్దతిచ్చారు. ఒత్తిడి కారణంగానే ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారని, ఆయన మాటలు హృదయాంతరాల నుంచి వచ్చాయని అన్నారు.

అయితే, శివసేన (యూబీటీ) అధికార ప్రతినిధి ఆనంద్ దూబే భిన్నంగా స్పందించారు. సంజయ్ దత్ వ్యాఖ్యలను ఆయన మాట్లాడిన సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవాలన్నారు. దేశం శాంతియుతంగానే ఉందని, ఉజ్వల భవిష్యత్తు వైపు సాగుతోందని తెలిపారు. "ఇక్కడ ఏదైనా తప్పుగా అనిపించిన వారు, వేరే చోటికి వెళ్లిపోవచ్చు" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ వివాదంపై సంజయ్ దత్ ఆదివారం స్పష్టత ఇచ్చారు. శేఖర్ సుమన్ టాక్ షోలో తాను చేసిన వ్యాఖ్యలు సరదా సంభాషణలో భాగమని, ఎవరినీ కించపరిచే ఉద్దేశం లేదని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'గాంధీగిరి' స్ఫూర్తితో ప్రేమ, ఐక్యతను ప్రోత్సహించే ఉద్దేశంతోనే ఆ వ్యాఖ్యలు చేసినట్లు వివరించారు. గాంధీ జయంతి సందర్భంగా జరిగిన ఈ షోలో, "దేశంలో మునుపటి శాంతి కనిపించడం లేదు. ఆ మంచి రోజులు మళ్లీ రావాలని శివుడిని ప్రార్థిస్తున్నా" అని సంజయ్ దత్ వ్యాఖ్యానించారు.

## మంత్రి లోకేశ్ ను కలిసిన ఆసియా క్రీడల స్వర్ణ విజేత ఆర్చర్ జ్యోతి సురేఖ



**అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** అంతర్జాతీయ వేదికలపై పతకాల పంట పండిస్తూ దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తున్న ప్రఖ్యాత ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ సోమవారం రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయింది. ఇటీవల జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026లో స్వర్ణ పతకం సాధించిన ఆమెను మంత్రి లోకేశ్ ఘనంగా అభినందించారు. భవిష్యత్ లక్ష్యాలను నిర్దేశిస్తూ, 2028 ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని, ఇందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సోమవారం ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఈ భేటీ జరిగింది. తన తండ్రి సురేంద్ర కుమార్‌తో కలిసి జ్యోతి సురేఖ, మంత్రి లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా, జపాన్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్-2026 ఆర్చరీ కాంపౌండ్ మహిళల టీమ్ విభాగంలో స్వర్ణం గెలుచుకున్న జ్యోతి సురేఖను మంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించడం గర్వంగా ఉందని కొనియాడారు. ఏషియన్ గేమ్స్ చరిత్రలో జ్యోతి సురేఖ ఇప్పటివరకు నాలుగు స్వర్ణ పతకాలతో సహా మొత్తం ఆరు పతకాలు సాధించి అరుదైన రికార్డు సృష్టించింది. ఆమె నిలకడైన ప్రతిభ, పట్టుదల యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని లోకేశ్ అన్నారు. ఈ ప్రయాణంలో ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టమైన హామీ ఇచ్చారు.

# కొత్త పోరుకు ఓయూ వేదిక!

## నేడే ఎంఎస్ఎఫ్ జాతీయ సదస్సు.. ఏర్పాట్లు పూర్తి

## ముఖ్యఅతిథిగా ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ








**హైదరాబాద్/అక్టోబర్ 5 (జర్నలిస్ట్ వార్త):** మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జాతీయ ప్రతినిధుల సదస్సు నిర్వహించనున్నారు. సదస్సుకు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, వివిధ జిల్లాలు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల నుంచి విద్యార్థి ప్రతినిధులు హాజరుకానున్నారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు నేపథ్యంలో విద్యార్థులకు సంబంధించిన విద్యా, ఉద్యోగ, సంక్షేమ అంశాలపై సదస్సులో చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉన్నత విద్యలో అవకాశాలు, వసతిగృహాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు, పోటీ పరీక్షల శిక్షణ, ఉద్యోగ అవకాశాలు, విద్యార్థుల సమస్యలు తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది. వర్గీకరణ అమలు తర్వాత విద్యార్థులకు ఎదురయ్యే పరిస్థితులు, విద్యా రంగంలో వారి అవసరాలు, భవిష్యత్ కార్యాచరణపై ప్రతినిధులు అభిప్రాయాలు వెల్లడించనున్నారు. సదస్సులో మందకృష్ణ మాదిగ ప్రసంగించనుండటంతో ఆయన ఏ అంశాలను ప్రస్తావిస్తారన్న దానిపై విద్యార్థి ప్రతినిధుల్లో ఆసక్తి నెలకొంది. ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన పరిణామాలు, విద్యార్థుల సమస్యలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై ఆయన మాట్లాడే అవకాశం ఉన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

సదస్సు నేపథ్యంలో ఓయూ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు స్వాగతం పలుకుతూ పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేశారు. సదస్సు ప్రాంగణం, ప్రధాన మార్గాల్లో ఏర్పాటు చేసిన వెల్‌కమ్ పోస్టర్లు కనిపిస్తున్నాయి. ఏర్పాట్లను ఓయూ ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు గడ్డెపోగు మధుసూదన్ మాదిగతో పాటు డా. పల్లెర్ల సుధాకర్, విరపాకుల పరుశురాం, బిక్కి మురళీకృష్ణ తదితరులు పర్యవేక్షిస్తున్నారు. మాజీ జాతీయ అధ్యక్షుడు డా. చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. కొమ్ము శేఖర్ మాదిగ సదస్సు ప్రచారంలో భాగంగా ప్రత్యేక స్థాయిలో ఏర్పాటు పూర్తి చేశారు

## మెగా క్రేజీ అప్‌డేట్.. చిరంజీవి 'కాకా'లో
# కీలకపాత్రలో అనురాగ్ కశ్యప్




మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న కొత్త చిత్రం 'కాకా'లో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఈ సినిమాలో బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ ఓ అత్యంత కీలకమైన పాత్రలో నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చేరికతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. తాజాగా అనురాగ్ కశ్యప్ కూడా షూటింగ్‌లో జాయిన్ అయ్యారు. ఆయనతో పాటు ఇతర ప్రధాన నటులపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. విలక్షణమైన, పవర్‌ఫుల్ పాత్రలకు పెట్టింది పేరైన అనురాగ్ కశ్యప్, మెగాస్టార్ చిరంజీవి మధ్య తెరపై వచ్చే ముఖాముఖి సన్నివేశాలు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని అభిమానులు అంచనా వేస్తున్నారు. "ది వరల్డ్ ఆఫ్ కాకా జస్ట్ గాట్ డెడ్లియర్" అంటూ చిత్రబృందం చేసిన ప్రకటన ఈ అంచనాలకు మరింత బలం చేకూర్చింది.'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న 'కాకా' సినిమాపై మొదటి నుంచే భారీ ఆసక్తి నెలకొని ఉంది. ఇప్పటికే చిరంజీవి పుట్టినరోజున విడుదలైన 'కాకా' టైటిల్ గ్లింప్స్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఇప్పుడు అనురాగ్ కశ్యప్ చేరికతో ఈ ప్రాజెక్ట్ మరింత క్రేజీగా మారింది. ఈ చిత్రంలో అనశ్వర రాజన్ కూడా నటిస్తుండగా, మరికొందరు ప్రముఖ నటీనటులు కూడా భాగం కానున్నారు.కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె నారాయణ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు స్పష్టం చేశారు.

# స్వీయదర్శకత్వంలో కిరణ్ అబ్బవరం 'రియాలిటీ'..



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం దర్శకుడిగా మారారు. తన తదుపరి చిత్రంతో నటుడిగా, దర్శకుడిగా ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. కొంతకాలంగా ఖా13 అనే వర్కింగ్ టైటిల్‌తో ప్రచారంలో ఉన్న ఈ సినిమాకు 'రియాలిటీ' అనే ఆసక్తికరమైన పేరును ఖరారు చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందం టైటిల్ గ్లింప్స్‌ను, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా థియేటర్లలోకి తీసుకురానున్నట్లు ప్రకటించింది.

విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ సినిమా థీమ్‌ను తెలియజేస్తోంది. "చిన్న చిన్న ఆనందాలే... హై మూమెంట్స్" అనే ట్యాగ్‌లైన్‌తో పాటు "మన కథ. మన రియాలిటీ" అనే క్యాప్షన్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇది ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే సహజమైన కథతో తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది.

జాయ్ ఫిల్మ్స్ పతాకంపై సుధాకర్ చాగంటి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కిరణ్ అబ్బవరం సరసన దేవికా భట్ హీరోయిన్‌గా నటిస్తోంది. శరత్ కుమార్, సాయికుమార్, రమేశ్ ఇందిర, అన్నపూర్ణమ్మ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ప్రముఖ సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు. తనదైన శైలిలో యూత్‌ఫుల్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లతో గుర్తింపు తెచ్చుకున్న కిరణ్ అబ్బవరం, 'రియాలిటీ'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకోవాలని భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. క్రిస్మస్ విడుదలను లక్ష్యంగా పెట్టుకుని చిత్ర బృందం ముందుకు సాగుతోంది.

# ఆ దాడులకు నాకు సంబంధం లేదు..
## ఐటీ సోదాలపై రకుల్ ప్రీత్ సింగ్ ఫైర్!



తన పేరును ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ సోదాలతో ముడిపెడుతూ వస్తున్న వార్తలపై బాలీవుడ్ నటి రకుల్ ప్రీత్ సింగ్ తీవ్రంగా స్పందించారు. సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేస్తూ, ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఆ సోదాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా కొన్ని మీడియా సంస్థలు, ఆన్‌లైన్ రిపోర్టర్లు వార్తలను సంచలనం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు."కొందరు ఆన్‌లైన్ రిపోర్టర్లు, కొన్ని ప్రధాన మీడియా సంస్థల్లో వాస్తవాలను నిర్ధారించుకోకుండా వార్తలను సంచలనం చేసే ధోరణి పెరుగుతుండటం బాధాకరం. అందుకే ఒకేసారి అందరికీ స్పష్టత ఇవ్వాలనుకుంటున్నాను. ఆ సోదాలు నాకు సంబంధించినవి కావు" అని రకుల్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

తన నేపథ్యం గురించి వివరిస్తూ.. "నేను ఆర్మీ కుటుంబం నుంచి వచ్చాను. ఇండస్ట్రీలో నాకు ఎలాంటి గాడ్‌ఫాదర్ లేరు. కేవలం నా కష్టంతోనే ఈ స్థాయికి వచ్చాను. చట్టాన్ని గౌరవించే పౌరురాలిగా 20 ఏళ్ల వయసు నుంచే క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తున్నాను" అని ఆమె తెలిపారు.ఆర్థిక అవకతవకల ఆరోపణలను కూడా ఆమె ఖండించారు. "వ్యక్తిగతంగా గానీ, ఏ నిర్మాణ సంస్థ తరఫున గానీ నేను ఎలాంటి అక్రమ విదేశీ లావాదేవీలలో పాలుపంచుకోలేదు. దేశంలో లేదా విదేశాల్లో ఎవరి పేరు మీద కూడా నేను బినామీ ఆస్తులు కలిగి లేను. నాకు ఎవరూ ఎప్పుడూ ఎలాంటి ఆస్తులను బహుమతిగా ఇవ్వలేదు. అలాంటి ఖరీదైన బహుమతులు తీసుకోకూడదన్నది నా నియమం" అని రకుల్ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా మీడియా తీరుపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. "నా గురించి తప్పుడు, దురుద్దేశపూర్వక కథనాలు ప్రచురించిన వారందరూ వాటిని వెనక్కి తీసుకుని, వాస్తవాలను స్పష్టం చేయాలని కోరుతున్నాను. మీడియా వ్యాపారంలో ఎంత పెద్ద సంస్థకైనా ఆర్థిక ఒత్తిళ్లు ఉంటాయని నేను అర్థం చేసుకోగలను. కానీ అది వాస్తవాలను పణంగా పెట్టి జరగకూడదు. ఒకరి ప్రతిష్ఠ, జీవనోపాధిని దెబ్బతీసేలా అసలే ఉండకూడదు" అని ఆమె హితవు పలికారు.కాగా, ముంబైలో నటి రకుల్ ప్రీత్ సింగ్, ఆమె మామ, సినీ నిర్మాత వాషు భగ్నానీ, పనోరమా స్టూడియోస్‌కు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఆదాయపు పన్ను శాఖ సోదాలు నిర్వహించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆర్థిక అవకతవకల ఆరోపణలపై ముంబై ఐటీ విభాగం సుమారు 12 ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. సినిమా ఫైనాన్సింగ్ పేరుతో నిధులను అక్రమంగా విదేశాలకు తరలించారన్న ఆరోపణలపై ఈ దర్యాప్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తనపై వచ్చిన వార్తలను రకుల్ ఖండించారు.

# డీప్‌ఫేక్ అకౌంట్లపై 'మా' సీరియస్..
## వివరాలు సేకరిస్తున్నామన్న మంచు విష్ణు



తెలుగు చిత్ర పరిశ్రమను లక్ష్యంగా చేసుకుని డీప్‌ఫేక్ వీడియోలు, నెగెటివిటీని వ్యాప్తి చేస్తున్న సోషల్ మీడియా ఖాతాలు, నెట్‌వర్క్‌ల వివరాలను సేకరిస్తున్నామని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) అధ్యక్షుడు మంచు విష్ణు వెల్లడించారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమస్యపై శాశ్వత పరిష్కారం కోసం పరిశ్రమలోని కీలక విభాగాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఇటీవల వెలుగులోకి వచ్చిన ఏఐ డీప్‌ఫేక్ వీడియో ఘటనపై మంచు విష్ణు స్పందిస్తూ, దీనిని ఒకరిద్దరికి సంబంధించిన సమస్యగా కాకుండా, మొత్తం పరిశ్రమకు ఇది ఒక హెచ్చరికగా భావించాలని అన్నారు. హీరో రామ్ పోతినేని వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. "వారికి ముఖం లేదు, అందుకే భయం లేదు" అని, ఇలాంటి వారిని కట్టడి చేయాలంటే ఆన్‌లైన్ ఖాతాలకు ఆధార్‌తో అనుసంధానించే అంశంపై చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. దీని ద్వారా ఆన్‌లైన్‌లో జవాబుదారీతనం పెరుగుతుందని ఆయన సూచించారు.కొందరు నటుల ఫొటోలతో ఫ్యాన్ పేజీల రూపంలో నకిలీ ఖాతాలు సృష్టించి, వాటి ద్వారా ద్వేషాన్ని, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని విష్ణు విమర్శించారు. ఈ నెగెటివిటీలో కొంత పరిశ్రమలోపలి నుంచే వస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి ఖాతాలు, వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లపై 'మా' పూర్తి సమాచారాన్ని సేకరిస్తోందని, తగిన ఆధారాలతో చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని స్పష్టం చేశారు.డీప్‌ఫేక్‌లు, సైబర్‌బుల్లీయింగ్, సినిమాలపై ఉద్దేశపూర్వకంగా చేసే నెగెటివ్ ప్రచారాలను ఎదుర్కోవడానికి ఒక పటిష్టమైన, శాశ్వత వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని విష్ణు నొక్కిచెప్పారు. దీనికోసం తెలుగు ఫిలిం ఛాంబర్, నిర్మాతల మండలి, 'మా' ప్రతినిధులు తక్షణమే సమావేశం కావాలని ఆయన కోరారు. ఒక సినిమాపై విమర్శలు రావడం సహజమేనని, కానీ సినిమా విడుదలకు ముందే దానిని దెబ్బతీసే ఉద్దేశంతో వ్యవస్థీకృతంగా దాడి చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన స్పష్టం చేశారు.

# అఖండ-3 ఉంటుంది..
## నెలాఖరులోగా గుడ్‌న్యూస్: బోయపాటి

నందమూరి బాలకృష్ణ, మాస్ దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వచ్చిన ప్రతి సినిమా సూపర్ హిట్ అయ్యాయి. రీసెంట్‌గా వీరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమా 'అఖండ-2'. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. అయితే తాజాగా బోయపాటి శ్రీను అభిమానులకు గుడ్‌న్యూస్ చెప్పారు. 'అఖండ-3' కచ్చితంగా ఉంటుందని ఆయన అన్నారు. సోమవారం వివిపి ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వారికి వేద పండితులు ఆశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా బోయపాటి శ్రీను మాట్లాడుతూ.. నెలాఖరిలోగా తన కొత్త ప్రాజెక్టును ప్రకటిస్తానని తెలిపారు.



## వెంకీ-త్రివిక్రమ్ 'ఆదర్శ కుటుంబం' అక్టోబరు 9న రావడంలేదు..
# కారణం ఏంటో చెప్పిన నాగవంశీ



విక్టరీ వెంకటేశ్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా విడుదల వాయిదా పడింది. ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 9న థియేటర్లలోకి రావాల్సి ఉండగా, కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు నిర్మాత నాగవంశీ అధికారికంగా ప్రకటించారు. ఈ ఆకస్మిక పరిణామంతో వెంకటేశ్ అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

సినిమా వాయిదాకు గల కారణాలను నిర్మాత నాగవంశీ స్పష్టంగా వివరించారు. ఆయన మాట్లాడుతూ.. "సినిమాకు సంబంధించిన తుది దశ పనులు ఇంకా పూర్తి కాలేదు. మరో రెండు, మూడు పాటల చిత్రీకరణతో పాటు, కొన్ని కీలక సన్నివేశాల షూటింగ్ కూడా మిగిలి ఉంది. వీటికి తోడు ప్రచార కార్యక్రమాలను కూడా ప్రారంభించాల్సి ఉంది. ఈ పనులన్నీ పూర్తి చేయడానికి కనీసం రెండు నుంచి మూడు వారాల సమయం పడుతుంది.. సోషల్ మీడియాలో ఎవరూ వేలెత్తి చూపకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని తెలిపారు.నిర్ణయించిన తేదీకే విడుదల చేయాలనే తొందరలో నాణ్యతతో రాజీ పడలేమని నాగవంశీ పేర్కొన్నారు. "ప్రేక్షకులతో పాటు మేం కూడా థియేటర్‌లో సినిమా ఫైనల్ కాపీ చూడటం మాకు ఇష్టం లేదు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న కాపీనే థియేటర్లకు అందిస్తాం. సినిమా నాణ్యతకే మా మొదటి ప్రాధాన్యత. అందుకే పూర్తి సంతృప్తిగా అన్ని పనులు ముగించుకుని, కొత్త విడుదల తేదీని ప్రకటిస్తాం" అని ఆయన వివరించారు.

ప్రస్తుతం చిత్ర బృందం మిగిలి ఉన్న పనులను వేగంగా పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది. అయితే పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రాన్ని అక్టోబర్ 30న విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మొత్తానికి, భారీ అంచనాలతో ఎదురుచూస్తున్న ఈ సినిమా కోసం అభిమానులు మరికొంత కాలం వేచి చూడక తప్పదు.